



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 65 | బుధవారం 30 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఆపరేషన్ సిందూర్ ఆపాలని

# ఏ దేశాధినేత మాకు చెప్పలేదు

- లోక్ సభ వేదికగా మోదీ ప్రకటన - కాంగ్రెస్ పార్టీపై నరేంద్ర మోదీ ఆగ్రహం
- కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని స్పష్టీకరణ
- పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు చెప్పానన్న మోదీ
- ఆపరేషన్ సిందూర్‌ను కాంగ్రెస్ పార్టీని తప్పుపట్టడం శోచనీయమన్న మోదీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 29

లోక్‌సభ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. పాకిస్థాన్ మళ్లీ ఎలాంటి కుయుక్తులకు పాల్పడినా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని, దుశ్చర్యలకు తెగబడితే దీటుగా బదులిస్తామని ఆయన హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రవాదులను మట్టుబెడుతున్నామని ఆయన వెల్లడించారు. 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టి ఉగ్రవాదులను ఏరివేస్తున్నట్లు చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో చర్చకు సమాధానంగా మోదీ ప్రసంగించారు. కాల్పుల విరమణలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత్రను ప్రధానమంత్రి తోసిపుచ్చారు.



ఉగ్రవాదులను హతమార్చినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని తెలిపారు.

- మిగతా 2లో..



## అలాంటి సమయంలో యుద్ధాన్ని ఎందుకు ఆపారు?

- లోక్‌సభలో ప్రశ్నించిన ప్రియాంక గాంధీ
- నాయకత్వం అంటే క్రెడిట్ తీసుకోవడం కాదు.. బాధ్యత అన్న ప్రియాంక గాంధీ
- కాల్పుల విరమణ ప్రకటన ట్రంప్ చేయడం ప్రధానమంత్రి బాధ్యతారాహిత్యమన్న ఎంపీ

5లో



## ఎస్ఐఆర్‌ను తిరిగి వెనక్కి తీసుకోండి

- బీహార్ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ ఎంపీల నిరసన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 29

బీహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపిలు మంగళవారం ఆందోళన చేపట్టాయి. ఈ జాబితాను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. గత ఆరు రోజులుగా పార్లమెంట్ వేదికగా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. పార్లమెంటులో కార్యకలాపాలకు ముందు, వామపక్ష పార్టీలు సహా కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి,

- మిగతా 2లో..



## ట్రక్కును ఢీకొట్టిన బస్సు

- 18మంది యాత్రికులు మృతి

జార్ఖండ్ - సూర్య వాస్తవం, జూలై 29

జార్ఖండ్‌లోని డియోఘర్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల మేరకు కన్వర్ యాత్ర సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున 4 గంటల

- మిగతా 2లో..

## అమరావతి క్వాంటం వ్యాలీ - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

# ప్రయోజనాలు అందుకోండి

- సింగపూర్ పారిశ్రామికవేత్తలకు సిఎం చంద్రబాబు పిలుపు
- సింగపూర్ లో చంద్రబాబు బృందం మూడో రోజు పర్యటన
- ఏపీలో అనుకూల పరిస్థితులపై వివరణ




అమరావతి - సూర్య వాస్తవం, జూలై 29

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూల మైన పరిస్థితులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రత్యేకించి విశాఖలో దీనికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సింగపూర్ లో మూడోరోజు పర్యటిస్తున్న సీఎం ఆ దేశ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డేటా సెంటర్లు, ఐటీ కంపెనీల ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. త్వరలోనే గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు తెలియచేశారు. అలాగే టీసీఎస్, కాగ్నిజెంట్ సహా వివిధ ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖలో తమ సంస్థలను ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు.

అలాగే దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు

- మిగతా 2లో..

## 2న రైతుల ఖాతాలకు 'అన్నదాతా..' నిధులు

- సిఎస్ విజయానంద్

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 29



'అన్నదాతా సుఖీభవ' 'పిఎం కిసాన్' నిధులు అర్హులైన రైతులందరి ఖాతాల్లో ఆగస్టు 2న జమ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం

- మిగతా 2లో..

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- ఆగస్టు 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వారం రోజుల పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 1,45,97,486 మంది రైస్ కార్డు లబ్ధిదారులు
- కార్డులు ఉచితంగా పంపిణీ చేస్తామన్న మంత్రి నాదెండ్ల

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 29

ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వారం రోజుల పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరగనున్నట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 1,45,97,486 మంది లబ్ధిదారులకు ఈ స్మార్ట్ కార్డులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం ప్రతి నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యుల ఆధ్వర్యంలో,




జిల్లా స్థాయిలో మంత్రుల ఆధ్వర్యంలో, రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో సభలు

- మిగతా 2లో..

### శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

2లో

### 1,000 కోట్లతో 2,000 కి.మీ. కొత్త రోడ్లు

8లో

### రాజకీయాలకు నల్లారి గుడ్ బై...

8లో



## దోచుకుంది దాచుకోవడానికే సిఎం సింగపూర్ పర్యటన

- వైసీపీ అధినేత వైఎస్ జగన్

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 29

ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటనపై వైఎస్సార్ సిపి అధినేత వైఎస్ జగన్ హాట్ కామెంట్లు చేశారు. మంగళవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పీఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం దోచుకున్న డబ్బులు దాచుకోవడానికి మాత్రమే సింగపూర్ పర్యటన అని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని ఎన్నికల సమయంలో హామీ

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఆపరేషన్ సిందూర్ ఆపాలని

# ఏ దేశాధినేత మాకు చెప్పలేదు

(మొదటిపేజీ తరువాయి)

'ఆపరేషన్ సిందూర్' ఆపాలని ప్రపంచంలో ఏ నేత మనకు చెప్పలేదని ఆయన అన్నారు. మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనతో ఫోన్‌లో మాట్లాడారని, పాక్ భారీ దాడి చేయబోతోందని హెచ్చరించారని వెల్లడించారు. అలా జరిగితే పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు స్పష్టం చేశానని అన్నారు. పాకిస్థాన్‌కు ఎవరు సాయం చేసినా చూస్తూ ఊరుకునేది లేదని తేల్చి చెప్పామని అన్నారు. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెబుతామని చెప్పానని, చెప్పినట్లుగానే పాక్‌కు ఎప్పటికీ గుర్తుండిపోయే సమాధానం ఇచ్చామని ప్రధానమంత్రి అన్నారు. పాక్ డీజీఎం అర్ధరాత్రి ఫోన్ చేసి 'ఆపరేషన్ సిందూర్' ఆపాలని కోరితేనే నిలిపివేసినట్లు స్పష్టం చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గామ్ దాడి చేశారని మండిపడ్డారు. ఆ తర్వాత మన సైన్యం పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లి 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిందని గుర్తు చేశారు. ప్రపంచ దేశాలు 'ఆపరేషన్ సిందూర్'ను సమర్థించాయని, పాకిస్థాన్ వైపు మూడు దేశాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'ను కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టడం శోచనీయమని ప్రధానమంత్రి అన్నారు. మీడియా హెడ్‌లైన్‌లలో వచ్చేందుకు కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మీడియా హెడ్‌లైన్‌లలో ఉంటారేమో కానీ ప్రజల మనసుల్లో ఉండలేరని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌ను కాంగ్రెస్ వెనుకేసుకు రావడం దౌర్భాగ్యమని ఆయన అన్నారు. పైలట్ అభినందన్ పాక్‌కు చిక్కినప్పుడు కూడా కాంగ్రెస్ ఇలాగే మాట్లాడిందని, కానీ ఆయనను సురక్షితంగా తీసుకువచ్చామని గుర్తు చేశారు. భారత సైనిక శక్తిపై తమకు పూర్తి నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఎస్‌ఐర్‌ను తిరిగి

# వెనక్కి తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ఆర్‌జెడిలకు చెందిన పలువురు ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం మెట్లపై నిరసన చేపట్టారు. 'ఓట్ల దొంగతనం ఆపండి', 'ఎస్ఐర్‌ను తిరిగి వెనక్కి తీసుకోండి' అని నినాదాలు చేపట్టారు. 'ఓట్ల లూటీ ఆపండి', కేంద్రం, ఎన్నికల కమిషన్ (ఇసి)లు 'కుమ్మక్కు' అయ్యాయన్న ప్లకార్డులను ప్రదర్శించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం నుండి బీహార్ ఎస్ఐఆర్‌కి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్‌లో నిరసన తెలుపుతున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు 'ఓటు హక్కు లేకుండా చేయడం' లక్ష్యంగా ఈసి చర్యలు తీసుకుంటోందని మండిపడ్డారు. ఈ అంశంపై ఉభయసభల్లో చర్చ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

# ట్రక్కును ఢీకొట్టిన బస్సు

(మొదటిపేజీ తరువాయి)

30 నిముషాలకు మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జమునియా అడవి సమీపంలో యాత్రికులతో వెళుతున్న బస్సు గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 18మంది యాత్రికులు మరణించారు. 20 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి సహాయక బృందాలు చేరుకున్నాయి. గాయపడినవారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. స్థానికులు ఈ సంఘటన గురించి మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి ప్రియరంజన్‌కు సమాచారం అందించారు. ఆ తర్వాత ప్రియరంజన్ కుమార్ ఒక బృందంతో సంఘటనా స్థలానికి చేరుకుని, మోహన్‌పూర్ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు సమాచారం అందించారు. సహాయక చర్యలు ప్రారంభించి గాయపడినవారిని అంబులెన్స్ ద్వారా మోహన్‌పూర్ సిహెచ్‌సికి పంపారు. ఈ ప్రమాదంపై ఎంపీ నిషికాంత్ దూబే విచారం వ్యక్తం చేశారు. " నా లోక్‌సభ నియోజకవర్గమైన దేవఘర్‌లో శ్రావణ మాసంలో కన్వర్ యాత్ర సందర్భంగా వెళుతున్న బస్సు, ట్రక్కును ఢీకొన్న ప్రమాదంలో 18 మంది భక్తులు మరణించారు. బాబా బైద్యనాథ్ వారి కుటుంబాలకు ఈ నష్టాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నా " అని తెలిపారు.

## 2న రైతుల ఖాతాలకు

# 'అన్నదాతా..' నిధులు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించి ఎవరైనా ఇకెవైసి, ఎన్‌సిపై మ్యాపింగ్ కాని వారు వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఈ పథకం అమలుకు ఇంకా మూడు రోజులు సమయం ఉన్నందున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ పథకానికి అనర్హులుగా గుర్తించిన వారికి దానికి సంబంధించిన వివరాలను తెలపాలన్నారు. తిరస్కరణకు గురైన వారి వివరాలను మరోసారి పరిశీలించాలని సూచించారు. కొంతమంది రైతులకు సంబంధించిన భూమి మ్యుటేషన్ ప్రక్రియ చేయకపోవడం, ఆధార్ సీడింగ్ సరిగా నమోదు కాక పోవడం, చనిపోయిన వారికి సంబంధించిన అంశాలపై రె వెన్యూశాఖ చర్యలు తీసుకోకపోవడంతో ఈ పథకం వర్తించలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు మాట్లాడుతూ లబ్ధిపొందాలంటే ఇ-పంట, ఇకెవైసిలో నమోదు తప్పనిసరని స్పష్టం చేశారు.

# శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

శ్రీశైలం - సూర్య వాస్తవం, జూలై 29



శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరింది. దీంతో 7 గేట్లు 10 అడుగులు ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. ఇన్ ఫ్లో 2,59,116 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 2,55,811 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. శ్రీశైలం నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలుకాగా ప్రస్తుతం నీటి నిల్వ 204.7880 టీఎంసీలుగా ఉంది.

## అమరావతి క్వాంటం వ్యాలీ

# ప్రయోజనాలు అందుకోండి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నామని... 2026 జనవరి నాటికి ప్రారంభ మయ్యే క్వాంటం వ్యాలీ ఎకో సిస్టంలో సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశముందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ప్రయోజనాలను సింగపూర్ కంపెనీలు పొందటంతో పాటు పరిశోధనలకూ ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలంగా 20కి పైగా పాలసీలను అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. పారిశ్రామిక అనుకూల విధానాలతో పాటు పెట్టుబడులకు ఉన్న అవకాశాలను రౌండ్ టేబుల్ వేదికగా ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి.నారాయణ, ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### ఏపీ గ్రోత్ ఇంజిన్ గా విశాఖ

నగరాభివృద్ధి, వాణిజ్య సదుపాయాలు, మౌలిక వసతుల రంగాల్లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సింగపూర్‌కు చెందిన కెప్పెల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిమ్ యాంగ్ వియ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. సింగపూర్ లో మూడో రోజు పర్యటనలో భాగంగా సీఎం వివిధ పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో భేటీ అయ్యారు. అమరావతి నగర అభివృద్ధిలో కెప్పెల్ భాగస్వామ్యంపై ప్రధానంగా ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రాభివృద్ధి కోసం విశాఖను గ్రోత్ ఇంజిన్‌గా మార్చే లక్ష్యంతో ఐటీ, వాణిజ్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి కెప్పెల్‌ను ఆహ్వానించారు.

### జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం లక్ష్యం

అమరావతి నగర అభివృద్ధి, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పరిశ్రమల రంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్ మెంట్ కార్పోరేషన్ (జీఐసీ) సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ బ్రాన్ యోతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం, స్థిరమైన పెట్టుబడులపై ప్రణాళికల రూపకల్పనపై చర్చించారు. వైద్య, విద్య, పట్టణ ప్రణాళిక, పౌర సదుపాయాలు వంటి రంగాల్లో జీఐసీ పెట్టుబడులు పెట్టేలా అనువైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆయా రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు.

### ఫుడ్ ప్రాసెసింగ్‌పై విల్మర్ ఆసక్తి

అలాగే, విల్మార్ ఇంటర్నేషనల్ సంస్థ గ్రూప్ హెడ్ రాహుల్ కలేతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్, ఎడిబుల్ ఆయిల్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. రైతులకు విలువ ఆధారిత మార్కెట్‌ను కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో సహకరించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించగా విల్మర్ టెక్నాలజీ అందుకు ఆసక్తి వ్యక్తం చేసింది.

### సింగపూర్ ప్రభుత్వం నుంచి కీలక ప్రకటన

సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్ధంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ఏపీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.

### ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం విలువైంది

వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలియచేశారు. ఏపీ ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రి టాన్ సీ లెంగ్ కు ఎక్స్ వేదికగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ సుస్థిరాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషదాయకమని అన్నారు. వివిధ రంగాల్లో ఏపీ-సింగపూర్ కలిసి పని చేయడానికి టాన్ సీ లెంగ్ తో జరిపిన చర్చలు బాటలు వేశాయని సీఎం పేర్కొన్నారు.

### మంత్రి లోకేశ్ సమక్షంలో టెజరాక్ట్, యూట్యూబ్ అకాడమీలతో ఎంఓయూ

ఆంధ్రప్రదేశ్ లో సృజనాత్మక ఆర్థిక వృద్ధి కోసం క్రియేటర్ అకాడమీని స్థాపించడానికి రెండు ప్రధాన సంస్థలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్ షాంగ్రీలా హెూటల్ లో జరిగిన కార్యక్రమంలో టెజారాక్ట్ ప్రెసిడెంట్ తేజ ధర్మ, వైస్ ప్రెసిడెంట్-ఏపీఏసీ గౌతమ్ ఆనంద్, ఏపీ ప్రభుత్వం ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సృజనాత్మక కంటెంట్ తయారీ కోసం ఏపీ ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటు చేస్తుంది. పాఠ్యాంశాలు, శిక్షణా కార్యక్రమాలకు గూగుల్ సంస్థ వనరులు, సాంకేతికత, నైపుణ్యాలను అందించనుండగా, టెజారాక్ట్ సంస్థ ఫిజికల్ సెటప్, నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించి జరుగుతుందని మంత్రి వివరించారు.

### కేవైసీ పూర్తిలో దేశంలోనే ప్రథమ స్థానం

రేషన్ కార్డుల కేవైసీ పూర్తి చేయడంలో ఆంధ్రప్రదేశ్ 96.05 శాతం మేర పూర్తి చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని మంత్రి నాదెండ్ల మనోహర్ సంతోషం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలలోపు, 80 సంవత్సరాలు పైబడిన మొత్తం 11,47,132 మం దికి కేవైసీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

### రేషన్ కార్డు మార్పులు, చేర్పులు

రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం 16,08,612 దరఖాస్తులు రాగా, వాటిలో 15,32,758 దరఖాస్తులను సానుకూలంగా పరిష్క రించినట్లు మంత్రి తెలిపారు. కేవలం 4.72 శాతం దరఖాస్తులు మాత్రమే తిరస్కరించబడ్డాయని పేర్కొ న్నారు. ఈ ప్రక్రియ ద్వారా కొత్తగా 9,87,644 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, మొత్తం లబ్ధి దారుల సంఖ్య 4,29,79,897కు చేరుకుందని చెప్పారు. వీరిలో 2,68,23,200 మందికి కేంద్ర ప్రభుత్వం, 1,61,56,697 మందికి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో రాష్ట్రంలో రైస్ కార్డుల సంఖ్య 1,45,97,486కు చేరుకుందన్నారు.

### స్మార్ట్ కార్డుల ప్రత్యేకతలు

ప్రస్తుతం ఉన్న పాత రేషన్ కార్డుల విధానాన్ని డిజిటలైజ్ చేసి, భద్రత, జవాబుదారితనం, పారదర్శకతతో కూడిన డెబిట్, క్రెడిట్ కార్డు తరహాలో ఈ స్మార్ట్ కార్డులను రూపొందించామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకు ఈ కార్డులపై రాజకీయ నాయకుల ఫోటోలు లేకుండా, కుటుంబ పెద్ద ఫోటోతో పాటు సభ్యుల పేర్లన్నీ పొందుపర్చడం జరిగిందన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్‌తో అనుసంధానం చేయ బడిందని, తద్వారా ప్రతి లావాదేవీ సెంట్రల్ ఆఫీ సులో వెంటనే నమోదు అవుతుందని వివరించారు.

### రేషన్ పంపిణీ సమయాలు

ఈ క్యూఆర్ కోడ్ స్మార్ట్ కార్డులు అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26,796 రేషన్ షాపుల్లో ప్రతి నెలా 1 నుండి 15వ తేదీ వరకు ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు సాయంత్రం 4:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అయితే, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, ప్రభుత్వ పింఛన్లు పొందే దివ్యాంగులకు గత మూడు నెలల నుండి 26 నుండి 30వ తేదీ వరకు వారి ఇంటి వద్దే రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో కొన్ని సమస్యలు ఉన్నాయని, స్వయంగా ఆ జిల్లాలో పర్యటించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని మంత్రి హామీ ఇచ్చారు.

### దీపం-2 పథకం విజయవంతం

గత ఏడాది నవంబర్‌లో దీపావళి నుండి ప్రారంభించిన దీపం-2 పథకం విజయవంతంగా అమలు అవుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మొదటి విడతలో 97.59 లక్షల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేసి, రూ.764 కోట్ల రాయితీ సొమ్మును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుండి ప్రారంభమైన రెండో విడతలో ఇప్పటి వరకు 93.46 లక్షల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేసి, రూ.747 కోట్ల రాయితీ సొమ్మును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు. మరో రూ.35 కోట్లు అడ్వాన్స్ గా ఆయిల్ కంపెనీల వద్ద ఉన్నట్లు తెలిపారు. రెండో విడత కింద ఇంకా సిలిండర్లు పొందనివారంతా ఈ నెలాఖరులోపు పొందాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## దోచుకుంది దాచుకోవడానికే

# సిఎం సింగపూర్ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. కానీ ఇప్పుడు ఆ పథకాన్ని అమలు చేయాలంటే.. రాష్ట్రాన్ని అమ్మాలి అంటున్నారు.. ఇంత కన్నా పచ్చిమోసం ఉంటుందా? అని జగన్ కూటమి ప్రభుత్వ నేతలను నిలదీశారు. ఫీజురియింబర్స్ మెంట్ ఇవ్వకపోవడం వల్ల పిల్లల చదువులు మానేసే పరిస్థితులు వచ్చాయి. గత వైఎస్సార్ సిపి ప్రభుత్వం ఐదేళ్లలో అన్నిరకాల అప్పులు రూ.3.32 లక్షల కోట్లు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఈ 14 నెలల్లో సిఎం చంద్ర బాబు అందులో 52శాతం చేశాడు. ఏ పథకం లేదు, ఏ స్కీమూ లేదు.. రాష్ట్రానికి రావాల్సిన ఆదా యాలు రావడంలేదు.. అంతా దోచుకుంటు న్నారు. కేవలం దోచుకున్న డబ్బులు దాచుకోవడానికి మాత్రమే సింగపూర్ పర్యటన అని ఆయన దుయ్యబట్టారు.

వైఎస్సార్ సిపి పార్టీ తరపున త్వరలో యాప్ విడుదలచేస్తాం. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యా యం జరిగినా.. వెంటనే యాప్‌లో నమోదు చేయ వచ్చు అని జగన్ అన్నారు. పలానా వ్యక్తి, పలానా అధికారి కారణంగా అన్యాయంగా ఇబ్బంది పడ్డానని చెప్పొచ్చు.. ఆధారాలుకూడా ఆ యాప్‌లో పెట్టొచ్చు.. ఆ ఆధారాలన్నీకూడా అప్‌లోడ్ చేయొచ్చు.. ఆ కంప్లైంట్ ఆటోమేటిగ్‌గా మన డిజిటల్ సర్వర్‌లోకి వచ్చేస్తోంది.. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలన చేస్తాం.. అన్యా యానికి గురైన వారంతా ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చు అన్నారు. ఆధారాలుగా ఉన్న వీడియోలు, పత్రాలను అప్‌లోడ్ చేయొచ్చు. ఈ ఫిర్యాదులపై పరిశీలన జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయమని జగన్ హెచ్చరించారు.ఇప్పుడు చంద్ర బాబు ఏదైతో విత్తారో అదే చెట్టవుతోంది. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో.. కార్యక్రమం కింద బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ.. కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. మండలాల్లో కూడా దాదాపుగా పూర్తికావొచ్చిందన్నారు. 90 నియోజకవర్గాల్లో గ్రామస్థాయిలోకూడా ప్రారంభమై ముమ్మరంగా సాగుతోంది. వచ్చే నెలలో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం ఉద్ధృతంగా చేయాలి. క్యూ ఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, ప్రతి కుటుంబానికీ ఎంత బాకీ పడ్డాడో చెప్పాలి. రచ్చబండ కార్యక్రం ద్వారా కమిటీల ఏర్పాటుకూడా ఉద్ధృతంగా సాగుతోంది. బాబుష్యూరిటీ, మోసం గ్యారంటీ కింద గ్రామస్థాయిలో జరుగుతున్న రచ్చబండ కార్యక్రమం చాలా పగడ్బందీగా జరగాలి. మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామన్న భావన ప్రజల్లో బాగా వెల్లడవుతోంది. ఇస్తానన్న బిర్యానీ లేదు. ఉన్న పలావు కూడా పోయింది.. అందుకే మన కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోంది.. చిన్న చిన్న విభేదాలను రూపు మాపి అందర్నీ ఒక్కతాటిపైకి తీసుకు రావాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ సూచించారు.

# సంపాదకీయం

## లే ఆఫ్స్ సీజన్



రప్పా.. రప్పా.. ఇటీవల చాలా ఫేమస్ అయిన డైలాగ్ ఇది. పుష్ప2 సినిమాలోని ఈ డైలాగ్ ఇటీవల రాజకీయాల్లో వాడుతున్నారు. ఇప్పుడు ఇదే డైలాగ్ ఐటీ కంపెనీలను కూడా తాకింది. ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విశ్వరూపం చూపిస్తూండటంతో ఐటీ రంగంలో అనిశ్చితి ప్రారంభమయింది. దిగ్గజాలు కూడా ఉద్యోగుల్ని భారీగా తొలగిస్తున్నాయి. ఏఐ రంగంలో నియామకాలు చేపడుతున్నాయి. లే ఆఫ్స్ చేయకుండా ఆపలేకపోతున్నామని సుందర్ పిచాయ్, సత్యనాదెళ్ల లాంటి వారు ఆవేదన చెందుతున్నారు. ఆ ప్రక్రియ ఇప్పుడు ఇండియాకూ పాకినట్లుగా కనిపిస్తోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తన మ్యాన్ పవర్‌లో రెండు శాతాన్ని తగ్గించుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో ఇండియా ఐటీ రంగంలోనూ లే ఆఫ్స్ భయం ప్రారంభమయింది.టీసీఎస్ లో ఆరు లక్షలకు మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో పన్నెండు వేల మందికి లేఆఫ్స్ ప్రకటించనుంది. ఇందకు ముందే టీసీఎస్ ఓ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. అత్యధిక కాలం బెంచ్ పై ఉండే ఉద్యోగుల్ని పంపించేయాలని డిసైడ్ అయింది. బెంచ్ పై ఉండేవాళ్లు.. తమ స్కిల్స్ ను ఎప్పటికప్పుడు అప్డేట్స్ చేసుకునే అవకాశం కంపెనీ ఇస్తుంది. దాని ప్రకారం అప్ డేట్ చేసుకుని ఏదో ఓ ప్రాజెక్టులో చేరిపోతే ఉద్యోగం ఉంటుంది. లేదంటే పోతుంది. ఇలా వారిని ఉద్యోగాల్లో ఉంచడానికి, ఉండటానికి అన్ని అవకాశాలు కల్పించిన తర్వాతనే లేఆఫ్స్ ప్రకటిస్తున్నారు కానీ.. వర్క్ లో ఉండగా.. మెయిల్స్ పంపడం లేదు.ప్రాజెక్టులు వస్తున్నప్పుడు ఐటీ కంపెనీలు.. బెంచ్ స్ట్రెంత్ నూ ఉంచుకుంటాయి. ఒకప్పుడు మ్యాన్ పవర్ అందుబాటు తక్కువగా ఉండేది. ఇప్పుడు ఓవర్ ఫ్లో అవుతోంది. పైగా ఆటోమేషన్ , ఏఐ సాంకేతికతలు రొటీన్ టాస్క్‌ల అవసరాన్ని తగ్గిస్తున్నాయి. ముఖ్యంగా మాన్యువల్ టెస్టింగ్ వంటి రోల్స్‌లో అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇతర సంస్థలు కూడా ఇదే దారిలో నడిచే అవకాశం ఉందని ఇండస్ట్రీ నిపుణులు చెబుతున్నారు. ఇన్ఫోసిస్, విప్రో వంటి ఇతర ఐటీ సంస్థలు లాభదాయకతను కాపాడుకోవడానికి , క్లయింట్ డిమాండ్‌లకు అనుగుణంగా ఉండటానికి ఇలాంటి లేఆఫ్స్‌ను అనుసరించవచ్చని అంచనా. సైబర్‌సెక్యూరిటీ, డిజిటల్ ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతికతలలో స్కిల్ గ్యాప్ కారణంగా ఈ లేఆఫ్స్ జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు సీనియర్ ఉద్యోగులు, ముఖ్యంగా మిడిల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నవారు, కొత్త సాంకేతికతలకు అనుగుణంగా రీస్కిల్ చేసుకోవడంలో విఫలమవుతున్నారు. ఏఐ , ఆటోమేషన్ ఐటీ రంగాన్ని రీషేప్ చేస్తున్నాయి. ఇది రీస్కిల్లింగ్ , అప్‌స్కిల్లింగ్ అవసరాన్ని బలంగా చెబుతోంది. సంస్థలు హై-వాల్యూ సర్వీసెస్ , అధునాతన సాంకేతికతలపై దృష్టి సారిస్తున్నాయి. ఈ దిశగా ఉద్యోగులు దృష్టి పెట్టాల్సిందే.భారత ఐటీ రంగంలో అగ్రగామి సంస్థగా ఉన్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) సంస్థ అచ్చం ఈ డైలాగ్ తరహాలోనే ఉద్యోగులను ఊచకోత కోస్తోంది. 2025లో 12,261 ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది, ఇది దాని మొత్తం 6,13,069 మంది ఉద్యోగులలో 2%ని సూచిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, నైపుణ్య అసమానతలు ఈ లేఆఫ్‌లకు ప్రధాన కారణాలుగా సంస్థ చెబుతోంది. ఈ నిర్ణయం మిడిల్, సీనియర్ స్థాయి మేనేజర్‌లపై ఎక్కువ ప్రభావం చూపనుంది, ఇది ఐటీ రంగంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలను రేకెత్తిస్తోంది.టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ ప్రకారం, 12,261 ఉద్యోగుల తొలగింపు నిర్ణయం అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, ఏఐ ఆధారిత ఆపరేటింగ్ మోడల్‌లు, నైపుణ్య అసమానతల కారణంగా తీసుకోబడింది. కంపెనీ గతంలో ఉద్యోగుల శిక్షణ, రీస్కిల్లింగ్‌పై గణనీయమైన పెట్టుబడులు పెట్టినప్పటికీ, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈ చర్య అనివార్యమైందని పేర్కొన్నారు. ఈ లేఆఫ్‌లు ప్రధానంగా మిడిల్, సీనియర్ స్థాయి మేనేజర్‌లను లక్ష్యంగా చేసుకున్నాయి. వీరికి ఇప్పటికే ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించబడింది. ఈ నిర్ణయం టీసీఎస్ యొక్క భవిష్యత్-సిద్ధమైన వ్యూహంలో భాగంగా, ఏఐ, కొత్త టెక్నాలజీలలో పెట్టుబడులను పెంచడానికి తీసుకున్న చర్యగా టీసీఎస్ పేర్కొంటోంది.కఠినమైన బెంచ్ పాలసీ ఈ లేఆఫ్‌లలో కీలక పాత్ర పోషించింది. కంపెనీ నిబంధనల ప్రకారం, ఉద్యోగులు ఏడాదిలో కనీసం 225 రోజులు ప్రాజెక్టులలో చురుకుగా పనిచేయాలి, బెంచ్‌పై (ప్రాజెక్టు లేని స్థితిలో) గరిష్టంగా 35 రోజులు మాత్రమే ఉండాలి. ఈ పాలసీని అమలు చేయడంలో విఫలమైన ఉద్యోగులను లేఆఫ్ పేరుతో తొలగిస్తోంది. ఈ విధానం ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోంది. కొంతమంది ఈ విషయంలో కోర్టును ఆశ్రయించారు. ఈ ఒత్తిడి, అనిశ్చితి ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.రంగంలో కొత్త నియామకాలు 2025లో 72% తగ్గాయి. ఇది ఉద్యోగ ఆకాంక్షులకు, ప్రస్తుత ఉద్యోగులకు సవాల్‌గా మారింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి అగ్ర కంపెనీలు కొత్త రిక్రూట్‌మెంట్‌ను దాదాపు నిలిపివేసి, ఉన్న ఉద్యోగులను తగ్గించడంపై దృష్టి సారించాయి. ఈ పరిస్థితి ఐటీ నిపుణులలో ఆందోళనను పెంచుతోంది, ఎందుకంటే కొత్త అవకాశాలు లేకపోవడంతో పాటు ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతున్నాయి. ఈ తగ్గుదల కారణంగా, ఐటీ రంగం ఒకప్పుడు రంగుల ప్రపంచంగా భావించబడిన ఆకర్షణను కోల్పోతోంది.ఆధారిత ఆటోమేషన్, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు టీసీఎస్ లేఆఫ్‌లకు ప్రధాన కారణంగా సీఈవో వెల్లడించారు. ఏఐ ఆపరేటింగ్ మోడల్స్ సంప్రదాయ ఐటీ రోల్స్‌ను తగ్గిస్తున్నాయి. క్లయింట్ డిమాండ్‌లో సంకోచం కంపెనీలను ఖర్చు తగ్గింపు చర్యలకు ఒత్తిడి చేస్తోంది. టీసీఎస్ ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీలో పెట్టుబడులను పెంచుతోంది, కానీ ఆశించిన ఫలితాలు రావడం లేదని సీఈవో వెల్లడించారు. మరో వైపు సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాల ప్రభావం కీలక రంగాలపై పడటం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాదిలో యువత ఎక్కువగా అధిక ఆదాయం ఉన్నవారు సాఫ్ట్ వేర్ ఉద్యోగులే అవుతున్నారు. వారు పెట్టే ఖర్చులు, పెట్టుబడుల కారణంగానే చాలా రంగాల్లో దూకుడు కనిపిస్తోంది. ఇప్పుడు మెల్లగా సాఫ్ట్ వేర్ రంగంలో మార్పులు వస్తున్నాయి. ఈ క్రమంలో లే ఆఫ్స్ సీజన్ వచ్చేసింది. సాధారణంగా మాంద్యం వల్ల లే ఆఫ్స్ ప్రకటిస్తారు..కానీ ఇప్పుడు ఏఐ, ఆటోమేషన్ వల్ల తొలగింపులు జరుగుతున్నాయి.మాస్ లే ఆఫ్స్ కారణంగా ఉద్యోగుల్లో ఓ రకమైన భయం నెలకొంది. ఉద్యోగ భద్రత గండంగా మారడంతో దీర్ఘకాలిక పెట్టుబడులపై వారు వెనుకడుగు వేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇళ్ల కొనుగోలు వంటి వాటిపై ఆలోచిస్తారు. ఇప్పటికే ఐటీ కారిడార్ ఉన్న హైదరాబాద్ వెస్ట్ లో రియల్ ఎస్టేట్ పరిస్థితి మెరుగుపడలేదు. మార్కెట్ కు మించి లగ్జరీ ప్రాజెక్టులు నిర్మించేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడు ఇంకా డిమాండ్ తగ్గనుంది. సాఫ్ట్ వేర్ పరిశ్రమలో ఎంత పెద్దస్థాయిలో ఉన్నా.. సరే కాస్త ఆలోచిద్దామని అనుకునేవారి సంఖ్య పెరుగుతుంది.ఇతర రంగాల వారిపై ఈ లేఆఫ్‌ల ప్రభావం ఎంత ఉంటుందన్నదానిపై అంచనాలు లేవు. అయితే రియల్ ఎస్టేట్ మందగిస్తే ఇతర రంగాల్లోనూ వ్యాపారాలు మందగిస్తాయి. ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ అంతా ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటుంది. ఎక్కడ బలహీమైనా పరిస్థితి తారుమారవుతుంది. అందుకే.. కొంత కాలం ఇబ్బందికర పరిస్థితులు తప్పవన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# 21 మంది ఎమ్మెల్యేలకు స్ట్రెయిట్ వార్నింగ్




**విజయవాడ - సూర్య వాస్తవం**

మీరు బాగా పనిచేస్తే..పార్టీకి మేలు. మీ పొలిటికల్ ఫ్యూచర్ బాగుంటుంది. మళ్లీ మళ్లీ గెలిచి అసెంబ్లీకి రావొచ్చు. ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలి పోతామంటే మీ ఇష్టం. అంటూ ఎమ్మెల్యేలకు పదే పదే వార్నింగ్ ఇస్తూ వస్తున్నారు సీఎం చంద్రబాబు. ఇప్పటికే పలుసార్లు ఎమ్మెల్యేలతో భేటీ అయి..అలర్ట్ చేస్తూ.. వార్నింగ్‌లు ఇస్తూ వచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఏకంగా వన్ టు వన్ మీటింగ్‌లు పెట్టుకున్నారు. ఇప్పటివరకు 21మంది ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అయిన సీఎం..ఎమ్మెల్యేల పనితీరు.. వారి మీద వచ్చిన ఆరోపణలు..క్యాడర్‌కు అందు బాటులో ఉన్న తీరు..ప్రభుత్వ పథకాలపై ప్రచారం వంటి వాటిపై ఆరా తీశారట. తనకు ఉన్న ఇన్ఫర్మేషన్, గ్రౌండ్ రిపోర్ట్ ప్రకారం ఎమ్మెల్యేలకు ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇస్తున్నారట. ఎమ్మెల్యేల అను కూలతలు, ప్రతికూలతలను బేరీజు వేస్తూ..పనితీరులో ఎలాంటి మార్పులు చేసుకోవాలో సలహాలు, సూచ నలు ఇస్తున్నారట. నియోజకవర్గాల వారీగా ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలపై సర్వే రిపోర్ట్ తెప్పించు కున్నారట. ఇప్పటివరకు 21 నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమావేశాలు పూర్తయ్యాయి. రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు ఎమ్మెల్యేలతో మాట్లాడు తున్నారు. ఒక్కో ఎమ్మెల్యేలతో దాదాపు 45 నిమిషాల పాటు సమావేశమవుతున్నారు.

ఎమ్మెల్యేలు పనితీరు ఇంకా మెరుగుపరచు కోవాలని సూచిస్తున్నారు. ముందుగా కాస్త వెనుక బడ్డారనుకున్న ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడుతున్నా రని అంటున్నారు. బాగా పని చేస్తున్న వారిని అభినందిస్తుండటంతో పాటు.. లోపా లున్న చోట మొహమాటం లేకుండా సరిదిద్దుకోవాలని చెబుతు న్నారు చంద్రబాబు. కొన్ని నియోజకవర్గాల్లో అవినీతి ఆరోపణలు, పార్టీ కార్యకర్తలతో సఖ్యత లేని చోట అంతా సరి చేసుకోవాలని సూచిస్తున్నారు. కాంట్ర వర్సీకి కేరాఫ్‌గా ఉంటున్న కొందరు ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తేల్చి చెబుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను మీడియాకు కూడా వివరిస్తున్నారు. పలువురు ఎమ్మెల్యేలకు 60 నుంచి 65 శాతం మేరకే ప్రజా సంతృప్తి ఉన్నట్లుగా రిపోర్ట్ అందడంతో వారికి స్పెషల్‌గా క్లాస్ తీసుకుంటున్నారట. ముఖ్యంగా కొత్త ఎమ్మెల్యేలకు, ఫస్ట్ టైమ్ గెలిచిన వారికి పదే పదే హితబోధ చేస్తున్నారు చంద్రబాబు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దని చెబుతూ వస్తున్నారు. ప్రజలు, కార్యకర్తలతో మమేకం కావాలని పదేపదే చెబుతున్న చంద్రబాబు ఇప్పుడు మరోసారి క్లాస్ తీసుకుంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. పనితీరులో మార్పు రావాలని, లేకపోతే అవసరమైన మార్పులు, చేర్పులు తప్పవని సీరియస్ వార్నింగ్సే ఇస్తు న్నారట. ఇదే సమయంలో శాసనసభ్యులపై వస్తున్న ఆరోపణలకు సంబంధించిన వివరా లను కూడా వారి ముందు పెట్టి వివరణ తీసు కుంటున్నారట. అనవసర విషయాల జోలికి వెళ్లొద్దని, అడ్డగో లుగా బిహేవ్ చేస్తే ఎవరి విషయం లోనైనా వెనుకాడేది లేదని తేల్చి చెబుతున్నారు. గాడి తప్పినా.. పార్టీ లైను క్రాస్ చేసినా యాక్షన్ తప్పదని ఎవరికీ మిన హాయింపు లేదని స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో మరి కొందరి ఎమ్మెల్యేలతో వన్ టు వన్ భేటీ కానున్నారు. సింగపూర్ పర్యటన తర్వాత మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. అయితే ప్రభుత్వం ఎన్ని పథకాలు ఇస్తున్నా..సర్కార్ నడుపుతున్న పెద్దలుగా ఎంత బాగా పనిచేస్తున్నా.. ఎమ్మెల్యేల పనితీరు చాలా కీలకమని భావిస్తున్నారట చంద్రబాబు. లోకల్‌గా ఎమ్మెల్యేకు మంచి పేరు లేకపోయినా.. ఆయన పబ్లిక్‌లో ఉండక పోయినా.. క్యాడర్ సమస్యలు పరిష్కరించక పోయినా.. తేడా కొట్టొచ్చని అంచనా వేస్తున్నారట. అందుకే ముందుగానే అలర్ట్ అయి ఎమ్మెల్యేలను సెట్‌రైట్ చేసే పనిలో పడ్డారట చంద్రబాబు ఇప్పుడు కూడా ఎంత అలర్ట్ చేయాలో అంత అలర్ట్ చేస్తున్నామ్.

ఏం సహకారం కావాలో చెప్పండి చేస్తామంటున్నామ్. అయినా కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా తిరుగుతామంటే ఇక మీ ఇష్టం. మంచి మార్కులు రాకపోతే టికెట్ కట్ చేయడానికి కూడా వెనకాడబోనని..ఇదే ఫైనల్ వార్నింగ్ చెప్తున్నారట. ఇప్పటికీ మించిపోయిందేమి లేదంటున్న బాబు..పద్దతి మార్చుకుని బాగా పనిచేయండి..మంచి ఫ్యూచర్ ఉంటదని భరోసా ఇస్తున్నారట. బాబు హితబోధతో అయినా ఎమ్మెల్యేల తీరులో మార్పు వస్తుందా లేదా అనేది చూడాలి.

# కేబినెట్ షఫ్లింగ్‌పై ఆశలు

**రెడ్డమ్మకు అవకాశం...**

**కడప - సూర్య వాస్తవం**



కూటమి ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ. ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట. క్యాబినెట్ షఫ్లింగ్ ఎప్పుడో..ఎంతమందిని తప్పించి.. మరెంత మంది కొత్తవారిని తీసుకుంటారో తెలియదు కానీ.. మంత్రివర్గ విస్తరణ జరిగితే తమకు బెర్త్ పక్కా అంటూ ఊహల్లో తెలియాడుతున్నారు ఆశావహులు. ఉమ్మడి కడప జిల్లా నుంచి ఇద్దరి పేర్లు క్యాబినెట్ రేసులో సౌండ్ రీసౌండ్ చేస్తున్నాయ్. మొదటి ప్రయత్నంలోనే గెలిచి ఫైర్ బ్రాండ్ లీడర్‌గా పేరు తెచ్చుకున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఒకరు అయితే..మరొకరేమో పార్టీకి వీర విధేయుడు పుట్టా సుధాకర్‌యాదవ్. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప అంటే విడిపోయిన నాలుగు జిల్లాలు ఉమ్మడి రెండు జిల్లాలకు కలిపి కొత్తగా ఎమ్మెల్యే అయిన రాయచోటి శాసనసభ్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మొదటి విడతలో మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. నాలుగు జిల్లాలకు కలిపి ఒకరే మంత్రిగా ఉండటాన్ని కొంతమంది పెద్దలు పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లడంతో విస్తరణలో మరొ కరికి అవకాశం ఇస్తామన్నారని టాక్. దీంతో ఉమ్మడి కడప జిల్లాలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మైదు కూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేరు మంత్రివర్గ విస్తరణలో ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన పుట్టా..మైదుకూరు నియోజక వర్గంతో పాటు రాష్ట్రంలోని చాలా నియోజక వర్గాల్లోని టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయ్. శ్రీవారి సేవతో పాటు సమాజసేవ చేసి చంద్ర బాబుకు నమ్మిన బంటుల ఉంటున్నారు. పైగా ఉమ్మడి కడప జిల్లాలో ఒకే ఒక బీసీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్. ఆర్థికంగా, సామాజికంగా సేవా దృక్పథం కలిగిన వ్యక్తి కావడం పుట్టా సుధాకర్ యాదవ్‌కు కలిసి వచ్చే అంశాలు.ఇక మొదటి ప్రయత్నంలోనే కడప ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచి హిస్టరీ క్రియేట్ చేశారు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి. మైనార్టీల కంచుకోటైన కడపలో గెలిచి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విప్ పదవిని కూడా దక్కించుకున్నారు. కడప నగరంలో ఓవైపు అభివృద్ధిపై ఫోకస్ పెట్టడంతో పాటు..ప్రత్యర్థి వైసీపీతో ఢీ అంటే ఢీ అంటుండటం మాధవిరెడ్డికి కలిసొచ్చే అంశాలు. ఆమె ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే కావడం..జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, మిగతా నేతల్లో సీనియర్లు ఎక్కువ. ఇది మాధవి రెడ్డికి కాస్త ఇబ్బందిగా మారొచ్చు. అయినా మంత్రి పదవి రేసులో కడప శివంగిగా పిలవబడే మాధవి రెడ్డి పేరు కూడా బలంగా వినిపిస్తోంది.మాధవిరెడ్డి భర్త కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికంగా బలవంతుడు కావడంతో పాటు నేరుగా చంద్రబాబు లోకేశ్‌తో టచ్‌లో ఉంటూ పొలిట్ బ్యూరో వ్యవహారాలు చక్కబెడు తుంటారు. మంత్రి పదవి వస్తే జిల్లాపై పట్టు పెంచు కోవడానికి అవకాశం ఉంటుందనే భావనతో భార్యకు మంత్రి పదవి తెచ్చుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారట. కడప మహానాడు వేదికగా శ్రీనివాస్ రెడ్డి భావోద్వేగం భార్యకు మంత్రి పదవి కోసమే అంటూ లోకల్ పార్టీలో టాక్.ప్రభుత్వ ఏర్పాటు అప్పుడే మాధవి రెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కుతుందని అనుకు న్నారు. అప్పుడు కుదరలేదు. మహానాడు వేదికగా ఏకంగా సీఎం చంద్రబాబు మాధవిరెడ్డిని పొగడటంతో ఆమెకు బెర్త్ పక్కా అన్న ఊహాగానాలు ఎక్కువయ్యాయి. అయితే మంత్రిగా అవకాశం ఇవ్వాలనుకుంటే బీసీ కోటా లేకపోతే మహిళా కోటా.. ఇలా చూస్తే వీరిద్దరిలో ఒకరికి అవకాశం తప్పనిసరి. ఈ ఈక్వేషన్స్ నేపథ్యంలో మాధవిరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్‌లలో ఎవరికి అమాత్య యోగం వరించబోతుందో చూడాలి మరి.

# మాల్దీవులు దిగొచ్చింది...

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం**



సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం లక్షద్వీప్ గురించి నరేంద్ర మోడీ గొప్పగా చెప్పారని మాల్దీవుల ప్రభుత్వం అడ్డగోలుగా వ్యాఖ్యలు చేసింది. భారత దేశంలో పర్యాటకం అత్యంత అధ్వానంగా ఉం టుం దని.. సముద్ర తీర ప్రాంతాలను సంరక్షించు కోలేదని.. అందువల్లే అక్కడికి పర్యాటకులు ఎక్కువగా రారని పిచ్చిపిచ్చిగా వ్యాఖ్యానించింది. అంతేకాదు ఆ వ్యాఖ్య లను సమర్థించుకుంటూ నెత్తి మాసిన చైనాతో అంట కాగింది. అయితే చైనా తో స్నేహం ఎంత ప్రమా దమో.. భారతదేశంలో విరోధం ఎంత ఇబ్బందికరమో మాల్దీవులకు తెలిసి వచ్చింది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడానికి సిద్ధమైంది. వాస్తవానికి చైనా ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఉంది కాబట్టి తమకు సహకరిస్తుందని మాల్దీవుల ప్రభుత్వం భావించింది. కానీ అది అంత సులభం కాదని.. తన అవసరాల కోసం మాత్రమే చైనా తమను వాడు కుందని మాల్దీవులకు అర్థమైంది. ఈ లోగానే మాల్దీవుల నుంచి భారత్ తన సైన్యాన్ని వెనక్కి రప్పిం చింది. ఎప్పుడైతే భారతదేశం విరీద మాల్దీవుల ప్రభుత్వం అడ్డగోలుగా వ్యాఖ్యలు చేసిందో.. అప్పటి నుంచి మన దేశం నుంచి పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్లడం మానేశారు. దీంతో పర్యాటకపరంగా మాల్దీవులు తీవ్రంగా నష్టపోయింది. హోటళ్లు బోసిపో యాయి. వ్యాపారం లేక ఇతర సంస్థలు బోర్డు తిప్పే శాయి. దీంతో మాల్దీవులు ఒక్కసారిగా నేల చూపులు చూడడం మొదలుపెట్టింది.చైనాతో స్నేహం ప్రమా దకరమని.. భారతదేశాన్ని దూరం పెట్టడం తెలివి తక్కువ నిర్ణయం అని యి మాల్దీవులకు అర్థమైంది. ఆలస్యంగా నైనా గుణపాఠం నేర్చుకున్న ఆ ప్రభుత్వం ఒక్కసారిగా మోడీ శరణుజొచ్చింది. అంతేకాదు మా దేశాన్ని కాపాడాలి అంటూ కాళ్ళ విరీద పడిరది. వాస్తవానికి మాల్దీవులతో భారత్ ఎప్పుడూ శత్రుత్వాన్ని కోరుకోలేదు. కానీ మాల్దీవులే అనవసరంగా గెలుక్కుంది. చివరికి అది ఎంత ఇబ్బందికరమో ఆ దేశానికి తెలిసి వచ్చింది. దీంతో భారత ప్రధాని నరేంద్ర మోడీని తమ దేశానికి ఆహ్వానించింది. రెండు రోజులపాటు నరేంద్ర మోడీ అక్కడ పర్యటిస్తారు. మాల్దీవులలో పర్యటిస్తున్న ప్రధానికి అక్కడి అధికారులు, ప్రభుత్వం, ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. మాల్దీవ్ రాజధాని మాలే ప్రాంతంలో రక్షణ మంత్రిత్వ శాఖ భవనంపై ఏకంగా అతిపెద్ద నరేంద్ర మోడీ భారీ చిత్రపటాన్ని ప్రదర్శించారు. ఆయనకు ఘన స్వాగతం పలికారు.. మోడీకి అక్కడి సైనిక సిబ్బంది ఘన స్వాగతం పలికారు. మోడీ నడిచి వస్తుండగా.. రక్షణ శాఖ కార్యాలయం పై నరేంద్ర మోడీ భారీ చిత్రపటం కనిపిస్తున్న దృశ్యాలను కొంతమంది సోషల్ విరీడియాలో పోస్ట్ చేశారు. ఇప్పుడు అవి సోషల్ విరీడియాను షేక్ చేస్తున్నాయి. బలమైన నాయకుడు ఉంటే ఎంతటి రాజ్యమైనా సరే కాళ్ళ కిందికి రావాల్సిందేనని నెటిజన్లు సోషల్ విరీడియాలో పేర్కొంటున్నారు.

# అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**రాయచోటి - సూర్య వాస్తవం, జులై 29:** ప్రజా దర్బార్ లో అర్జీలు ఇచ్చిన ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లి లో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించి, ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛంలతో సత్కరించి సన్మానించారు.

## ఉచిత బస్సు ప్రయాణం విధివిధానాలపై ఉమ్మడి రాయలసీమ ఆర్టీసీ అధికారులతో సమీక్ష

**- సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**




**రాయచోటి, తిరుపతి - సూర్యవాస్తవం, జూలై 29:** తిరుపతి నగరం లోని సాంస్కృత విద్యాలయంలో జరిగిన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బస్సు ప్రయాణం విధివిధానా లపై మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆర్టిసి ఎండి తో కలిసి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి అమలు కానున్న ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్టీసీ ఎండీ, రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లోని ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

## కందుకూరు మహాసభకు తరలిరండి : సీపీఐ



**రాప్తాడు - సూర్యవాస్తవం, జూలై 29:** అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామం నందు ఈనెల 31న నిర్వహిస్తున్న మహాసభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని సభను విజయవంతం చేయాలని సీపీఐ రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర పిలుపునిచ్చారు. ముఖ్య అతిధిగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున పాళ్యం నారాయణ స్వామి హాజరవుతున్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గం లోని మూడు మండలాలు రాప్తాడు మండలం అనంతపురం రూరల్ మండలం ఆత్మకూరు మండల కమిటీలు ఎంపిక చేస్తామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అన్యాయాలు అక్రమాలు దౌర్జన్యాలకు గురైన వాళ్ల తరపున న్యాయం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం అలుపెరుగని పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. భవిష్యత్తు కార్యాచరణకు ప్రజల సలహాలు సూచనలను తీసుకుంటామన్నారు.

## చికెన్ ఒకే రేటుకి విక్రయించాలి

**- వ్యాపారులను హెచ్చరించిన డిఎస్పి శ్రీనివాస్**



**డోన్ - సూర్యవాస్తవం, జులై 29:** ఇటీవల డోన్ పట్టణంలో చికెన్ వ్యాపారులు సిండికేట్ అయి ఒకే ధరకే ప్రజలకు అమ్మాలని తక్కువ ధరకు అమ్మేవారిపై ఒత్తిడి తేవడం జరిగింది. ఈ క్రమంలోనే డోన్ డిఎస్పి శ్రీనివాస్ పట్టణంలోని చికెన్ వ్యాపారులు వారికి నచ్చినట్లు తక్కువ ధరకు ప్రజలకు విక్రయించవచ్చుకోవచ్చని, అలాకాకుండా తాము చెప్పిన ధరలకే విక్రయించాలని వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకోబడతాయని పట్టణంలో ఉన్న వ్యాపారులను హెచ్చరించారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**- మహిళలు చిన్న పిల్లల భద్రతకు శక్తి టీం - రోడ్డు భద్రత నియమాలు పాటించాలి**

**- డ్రగ్స్‌కు బానిసైతే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని యువతను హెచ్చరించిన అదనపు ఎస్పీ (పరిపాలన) యం.వెంకటాద్రి**





**అన్నమయ్య బ్యూరో రాయచోటి, - సూర్యవాస్తవం, జూలై 29:** మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, వారిని చైతన్యపర్చి, మాదక ద్రవ్యాలపై పోరాటం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) యం.వెంకటాద్రి పిలుపు నిచ్చారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ, శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు, కార్యక్రమాన్ని జూలై 29న రాయచోటి పట్టణంలోని శ్రీ సాయిశుభ కళ్యాణ మండపంలో దాదాపు 650 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ యం.వెంకటాద్రి మాట్లాడుతూ - మాదక ద్రవ్యాలను నియంత్రించే విధంగా చట్టపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి వ్యాపారాలు సాగిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు చేపడుతున్నామని, మాదక ద్రవ్యాల అలవాటుకు యువత దూరంగా ఉండాలని, బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతను కోరారు. యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా, వాటికి అలవాటు పడిన వారిని మాదక ద్రవ్యాలకు దూరం చేసేందుకు, వారిలో చైతన్యం నింపేందుకు, జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వ్యసనాలకు బానిసలైతే కుటుంబ సభ్యులకు భారంగా మిగులుతామన్నారు. కావున, ప్రతీ ఒక్కరు మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చెయ్యాలన్నారు. తోటి స్నేహితుల ఒత్తిడి, ప్రోత్సాహాలకు లొంగిపోకుండా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువతకు పిలుపునిచ్చారు. సమాజంలో యువత పాత్ర క్రియాశీలకమైన దన్నారు. కళాశాలల్లో చేరిన తరువాత యువతపై తల్లిదండ్రుల ప్రత్యక్ష పర్యవేక్షణ కొరవడుతుందని, కొత్తగా ఏర్పడిన స్నేహితులు, పరిచయాలతో యువతను ప్రక్క దారి పట్టించే అవకాశం ఉంటుందన్నారు. డ్రగ్స్ సరదాగా తీసుకున్నపుడు ప్రారంభంలో తాత్కాలికంగా ఆనందాన్ని ఇచ్చినప్పటికీ, తరువాత కాలంలో సరదా, అలవాటుగా, వ్యసనంగా మారుతుందన్నారు. స్నేహితుల ఒత్తిడితో డ్రగ్స్ అలవాటైతే, ప్రాణాలు కోల్పోవలసి వస్తుందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తులు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. అంతేకాకుండా, మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారు తమ ఆర్థిక అవసరాల కొరకు అప్పులు చేస్తూ, వాటిని తీర్చేందుకు చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతూ, పోలీసులకు చిక్కి, న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ, తమ జీవితాలను జైళ్ళలో గడుపుతున్నారన్నారు. నేరస్థులుగా మారిన వారిపై రౌడీ షీట్స్ తెరిచి పోలీసు నిఘా ఉంటుందని, వారు ఏ ఉద్యోగంలో చేరినా, విదేశాలకు వెళ్ళాలనుకున్నా పోలీసు వెరిఫికేషనులో వారి నేరచరిత్ర బయటపడుతుందని, తద్వారా ఉపాధి, అవకాశాలు కోల్పోతారన్నారు. గంజాయి ఎంత తీవ్రమైన నేరమన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. మహిళలు, చిన్నపిల్లల భద్రతకు శక్తి' టీమ్, మహిళలు, చిన్నపిల్లల భద్రతకు సంబంధించి 'శక్తి' టీమ్ నిరంతరం కృషి చేస్తుంది. ఈ టీమ్ ఆపదలో ఉన్న మహిళలకు, పిల్లలకు అండగా ఉండి, వారికి తక్షణ సహాయాన్ని అందిస్తుంది. ఏదైనా ప్రమాదం లేదా వేధింపులు ఎదురైనప్పుడు, శక్తి టీమ్ కి సమాచారం అందించడం ద్వారా సత్వరమే చర్యలు తీసుకోబడతాయి. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి. ప్రతి ఒక్కరూ తమ భద్రతకు, ఇతరుల భద్రతకు రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలి. ట్రాఫిక్ లైట్లను గౌరవించి, నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. నిర్ణీత వేగంతోనే వాహనాలను నడపాలి. అతి వేగం ప్రమాదకరం. మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, చట్టరీత్యా నేరం. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌లనే ఉపయోగించాలి. మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే, మీరు చదువుతో పాటు మీ భద్రత పట్ల కూడా శ్రద్ధ వహించాలి. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్‌లో తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దు, మీ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు. మీ జీవితం ఎంతో విలువైనది. మీరు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే, మీతో పాటు మీ కుటుంబానికి, సమాజానికి కూడా మంచి జరుగుతుంది. ఏ ఆపద వచ్చినా భయపడకుండా, తక్షణమే మీ పెద్దలకు లేదా పోలీసులకు తెలియజేయండి. మీ భద్రతకు మేము ఎప్పుడూ ఉన్నామంటూ పేర్కొన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్.రవి మాట్లాతూ సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం వలన చాలా కుటుంబాలు, యువత నాశన మవు తున్నారన్నారు. సమాజానికి హాని కలిగించే మాదకద్రవ్యాల నియంత్రణ, నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేస్తున్నాయన్నారు. జిల్లా పోలీసుశాఖ యువతలో చైతన్యం తీసుకొని వచ్చేందుకు మంచి ఉద్దేశ్యంతో, ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ ధృఢ సంకల్పంతో పనిచేసి మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా, అమ్మకం, వినియోగం గురించి ఏదైనా సమాచారం తెలిస్తే సమాచారాన్ని పోలీసువారికి అందించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానన్నారు. జిల్లా కళాశాలల విద్యాధికారి ఎస్.రవి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ, శంకర మల్లయ్య, రాయచోటి ట్రాఫిక్ సిఐ, విశ్వనాథరెడ్డి, ఎస్ఐలు లోకేష్, వెంకటేష్, గాయత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యం.ప్రకాష్, ప్రతిభ కళాశాల కరస్పాండెంట్ ఏ.శివ గంగిరెడ్డి, రాజు విద్యాసంస్థల ప్రధాన ఉపాధ్యాయులు వై.గంగన్న, వివిధ కళాశాలల అధ్యాపకులు, జిల్లాలోని శక్తి టీం సభ్యులు, పోలీసు , వివిధ కళాశాలల ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కాశీభట్ల సాయినాధ శర్మ జన్మదిన వేడుకలు





**చెన్నూరు - సూర్యవాస్తవం, జూలై 29:** పుణ్యభూమి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి నాయకులు కాశీభట్ల సాయినాథ శర్మ జన్మదిన వేడుకలను మండలంలో ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో సోమవారం రాత్రి నుండి పలు కూడళ్లల్లో బ్యానర్లు ఏర్పాటు చేసిన ఆయన అభిమానులు మంగళవారం ఉదయమే చెన్నూరులోని బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో సాయినాథ్ శర్మ పేరున అర్చన, ప్రత్యేక పూజలు చేయించడం జరిగింది.

అలాగే బాణాసంచా పేలుస్తూ కేక్ కటింగ్ గావించి గ్రామంలో పంచిపెట్టారు. ఈ సందర్భంగా కాశీభట్ల సాయినాథ శర్మ అభిమానులు మాట్లాడుతూ, ప్రతిక్షణం పేదల పక్షాన పోరాడుతూ, తనను నమ్ముకున్న వారికి అన్ని విధాల అందుబాటులో ఉంటూ, ఏ సమస్య వచ్చిన తానున్నానంటూ అందరికీ భరోసా కల్పించి, వారికి అన్ని విధాల అడ్డదండలుగా ఉన్న పేదల పెన్నిధి తమ ఆత్మీయ నాయకునికి పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాదిలాగా ఈ ఏడాది కూడా ఆయన జన్మదినాన్ని ఆయన అభిమానులమైన తామంతా జరుపుకోవడమే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ గ్రామాలలో అక్కడ ఉన్న ప్రజలకు అందు బాటులో ఉండాలని తమకు తోచిన సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించిన మేరకు ఆయన అభిమాన అభిమానులమైన మేమంతా కూడా తూచా తప్పకుండా పాటించడం జరుగు తుందన్నారు. ఆయన కరోనా కష్టకాలంలో ప్రజలకు అనేక విధాలుగా సహకారాలు అందించడం జరిగిందని ఆక్సిజన్ కొరత ఉన్న ఆ సమయంలో ఆయన తన పుణ్యభూమి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆక్సిజన్ అందించడమే కాకుండా ఆయా గ్రామాలలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. అంతేకాకుండా ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పేదల పాలిట పెన్నిధి, భవిష్యత్ తరాల ఆశాజ్యోతి మా నాయకుడు కాశీభట్ల సాయినాథ్ శర్మ మరిన్ని పుట్టిన వేడుకలు జరుపుకోవాలని ఆయనకు ఆ దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆయన అనుక్షణం పేద ప్రజల కోసం తమ పుణ్యభూమి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవలు అందించాలని ఆయన అభిమానులు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద బుద్ధి వెంకట శివప్రసాద్, తుపాకుల జనార్దన్ రెడ్డి, చంగా బ్రహ్మయ్య, బాలకృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి, జయరాం, రవి, జనార్ధన్ తోపాటు పెద్ద ఎత్తున ఆయన అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు

**పామిడి - సూర్య వాస్తవం, జూలై 29:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలో పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి శత జయంతి సందర్భంగా దేశ పర్యటనలో భాగంగా ప్రేమ రథ వాహిని మంగళవారం పామిడి పట్టణమునకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక సత్య సాయిబాబా ట్రస్ట్ అధ్యక్షులు విశ్వనాథ్ రాజేశ్వరి దంపతులు వారి ఇంటి ఆవరణంలో కళశం పూజ, అర్చనలు చేయించి మహా మంగళహారతి గావించారు. అనంతరం భోగేశ్వర స్వామి భజన బృందంచే నగరోత్సవం నిర్వహించారు. ఈ రతం మన రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిందని ఇంచార్జ్ రామచంద్ర మూర్తి వెల్లడించారు. సత్యసాయి బాబా భక్తులందరికీ ఆయన ఫోటోలు, విభూది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం స్థానిక సత్య సాయిబాబా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో భక్తాదులు పెద్ద ఎత్తున నిర్వహించారు.



## ఈక్రాప్ బుకింగ్ చేయించుకోండి



**రాప్తాడు - సూర్యవాస్తవం, జులై 29:** ఖరీఫ్-2025 సీజన్ లో పంటలు పెట్టిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాఫ్ బుకింగ్ చేయించుకోవాలని తాసీల్దార్ విజయ కుమారి తెలియజేశారు. రాప్తాడు మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఈ క్రాప్ బుకింగ్ జాయింట్ అజమాయిషి కార్యక్రమంను నిర్వహించారు. ఈ సంధర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య మాట్లాడుతూ రైతులకు వేరుశనగ విత్తన కాయలు ఇంకా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు తమ పంటను కచ్చితంగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. రెవిన్యూ పరంగా భూమికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే విఆర్ఓ ని సంప్రదించి రెవెన్యూ వెబ్ ల్యాండ్ ఆధారంగా పంటను నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యాన పంటలను జియో ట్యాగ్ చేయాలి అన్నారు. వంకలు వాగులు బీడు భూములు బంజరు భూములు రైతులు పంటలు పెట్టని కాళీ భూములకు పంట నమోదు చేయకూడదన్నారు. ఈక్రాప్ బుకింగ్ లో అవకతవకలు జరిగితే వివిఏ వి హెచ్ ఎ ఎంపిఈఓల పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రంజిత రాణి, రైతు సేవ కేంద్రాల వీవీఏలు, విహెచ్ఎలు పాల్గొన్నారు.

## కస్తూరిబా స్కూల్, రైతు సేవ కేంద్రాల ఆకస్మిక తనిఖీ





**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూలై 29:** మద్దికేర మండలం మద్దికేర లోని కస్తూర్బా పాఠశాల తనిఖీ నిమిత్తం, రైతు సేవ కేంద్రాలను పరిశీలించిన తర్వాత ఆర్డీవో భరత్ నాయక్ మాట్లాడుతూ, కస్తూర్బా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులను వారికి సమస్యల గురించి వారి యొక్క చదువు భోజన సదుపాయం వసతి గురించి ఉపాధ్యాయులతో ఆరా తీశారు. విద్యార్థులకు అందరికీ ఎటువంటి అసౌకర్యం కలిగించకూడదని వారికి కొత్త కొత్త బోధన పద్ధతుల ద్వారా బోధించాలని సూచించారు. రైతు సేవ గోడౌన్లను పరిశీలించి తగిన నిలువలు సరిగా ఉన్నాయా లేదా అని వారికి తనిఖీ చేసి రైతులకు ఎటువంటి ఆ అసౌకర్యము కలిగించరాదని వారికి తగిన సీజన్లో ఎరువులు అందుబాటులో ఉండాలని రైతు సేవ ఉద్యోగులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా ఉపాధ్యాయులు, మద్దికేర రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అలాంటి సమయంలో యుద్ధాన్ని ఎందుకు ఆపారు?

**- లోక్‌సభలో ప్రశ్నించిన ప్రియాంక గాంధీ**

**- నాయకత్వం అంటే క్రెడిట్ తీసుకోవడం కాదు.. బాధ్యత అన్న ప్రియాంక గాంధీ**

**- కాల్పుల విరమణ ప్రకటన ట్రంప్ చేయడం ప్రధానమంత్రి బాధ్యతారాహిత్యమన్న ఎంపీ**

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, జూలై 29**

గతం గురించి మాట్లాడుతున్న వారు ప్రస్తుతం జరుగుతున్న వాటికి సమాధానం చెప్పడంలేదని విమర్శ శత్రువులు ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితుల్లో యుద్ధాన్ని ఎందుకు నిలిపివేశారో చెప్పాలని వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాయకత్వం అంటే కేవలం క్రెడిట్ తీసుకోవడం మాత్రమే కాదని, బాధ్యత కూడా ఉండాలని అన్నారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు చేయడం ప్రధానమంత్రి మోదీ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆమె విమర్శించారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, సోనియా గాంధీ గురించి అమిత్ షా మాట్లాడారని, కానీ అకస్మాత్తుగా యుద్ధాన్ని ఎందుకు ఆపారో చెప్పడం లేదని ప్రశ్నించారు. దేశ చరిత్రలో యుద్ధాన్ని ఆపడం మొదటిసారి అయితే, దానిని అమెరికా అధ్యక్షుడు ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. బైసరన్ వ్యాలీకి వేలాది మంది వస్తారనే విషయం ప్రభుత్వానికి తెలియదా? అని ఆమె నిలదీశారు. పాకిస్థాన్ ఇంతటి దారుణానికి పాల్పడుతుందని మన నిఘా వర్గాలు ఎందుకు గుర్తించలేకపోయాయని ప్రశ్నించారు. మన ప్రభుత్వం, నిఘా సంస్థల వైఫల్యమే దాడికి కారణమని, దీనికి బాధ్యత వహించేది ఎవరని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతం గురించి మాట్లాడేవారు ప్రస్తుతం జరుగుతున్న ఘటనలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు.

## రక్షక భటులకు డిస్కవర్ అనంతపురం హెల్మెట్ రక్ష

**- డిస్కవర్ అనంతపురంలో హెల్మెట్ వితరణ**

**- అనిల్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ**




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 29:** డిస్కవర్ అనంతపురం అనిల్ ఆధ్వర్యంలో పోలీసులకు హెల్మెట్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సిబ్బంది, పోలీసుల కోసం హెల్మెట్ బ్యాంకును మంగళవారం నాడు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రారంభించారు జిల్లా ఎస్పీ. ఇందులో భాగంగా... ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సిబ్బంది కోసం 40 హెల్మెట్లు, 14 వెహికల్ వీల్ లాక్ లను వితరణగా అందజేసిన అనంతపురం డిస్కవరీ నిర్వాహకులు అనిల్ ను అభినందించారు.అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లలో హెల్మెట్ బ్యాంకులను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఇదివరకే స్థానిక మహిళా పోలీసు స్టేషన్, త్రీటౌన్ పోలీసు స్టేషన్లలో వితరణగా హెల్మెట్ బ్యాంకుల ఏర్పాటుకు డిస్కవరీ అనంతపురం వారు ముందుకు రావడం ముదావహమని పేర్కొన్నరు జిల్లా ఎస్పీ.రోడ్డు ప్రమాదాల నియంత్రణలో హెల్మెట్ ధరింపు కీలకమని ఎన్ఫోర్స్మెంటు వర్క్ నిర్వహించే పోలీసులు ప్రజల్లో అవగాహన తెస్తున్నారని... పోలీసులు చేస్తున్న కృషికి స్వచ్ఛంధ సంస్థలు గుర్తించి వితరణగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామన్నారు.వీటితో పాటు కొత్తగా 14 వెహికల్ వీల్ లాక్స్ అందజేయడం జరిగింది. ప్రజలకు అసౌకర్యం కల్గించే విధంగాను, వాహనాల రాకపోకలకు ఆటంకం కల్గించే కార్లు, తదితర నాలుగు చక్రాల వాహనాలపై ఈ లాక్స్ ను ఉపయోగించి ఫైన్స్ విధించనున్నారు. ఈ కార్యక్రమంలో డిస్కవరీ అనంతపురం నిర్వాహకులు అనిల్ కుమార్, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సి.ఐ వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

### రసాయన ఎరువులు వాడకం వల్ల

## భూమిలో కర్బన శాతం తగ్గిపోతుంది

**- ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్. ప్రవీణ్ కుమార్**




**చెన్నూరు - సూర్యవాస్తవం, జూలై 29:** వరి సాగు చేస్తున్న రైతులు యూరియా టి ఏ పి రసాయన ఎరువులు వాడడం వలన భూమిలో కర్బన శాతం తగ్గిపోతున్నదని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలం లోని ఉప్పరపల్లి నర్సారెడ్డిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారులు మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, రసాయన ఎరువులు వాడడం వలన భూమిలో కార్బన్ శాతం తగ్గిపోవడమే కాక సూక్ష్మజీవులు అభివృద్ధి తగ్గిపోతున్నాయని రైతులకు సూచించారు. పకృతి వ్యవసాయం ద్వారా వరి సాగు చేయడం వలన భూమి సారవంతమవుతుందని వివరించారు. రసాయన ఎరువులు తగ్గించుకొని పీఎం డి ఎస్ ఘన జీవామృతం, ధ్రువ జీవామృతం వినియోగించుకోవాలని రైతులకు తెలిజేశారు. ( ఏ డబ్ల్యు డి) ఆరు తడి పంటలు సాగుచేసుకోవలన్నారు. తద్వారా నీరు, కరెంట్ ఆదా ఆవుతుందని పిలకలు అదికంగా రావడం జరుగుతుందన్నారు. మండలవ్యవసాయ అధికారి కె. శ్రీదేవి మాట్లాడుతూ, ప్రతిఒక్కరైతు పంట నమోదును చేయించు కోవాలని కోరారు. అలాగే ఆగస్టు 15 లోపల వరికి ప్రీమియం చెల్లించుకోవాల్సిందిగా తెలియజేశారు. మినుములు మినికిట్ అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు దగ్గరలో ఉన్న రైతుసేవ కేంద్రాలను సంప్రదించవలసిందిగా ఆమె తెలియజేశారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి సుచిత్ర రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులకు మార్పులు చేసుకోవాలని భూసార పరీక్షలను చేసుకొని వాటి అనుకూలంగా ఎరువులను వాడుకోవాలని సూచించారు. యూరియా వినియోగాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విఏఏ. కమలి, వైపి.భారత్ కుమార్, ఎన్ఎఫ్ ఏ.నరసింహారెడ్డి, ఐసిఆర్ పిఎస్ లు రైతులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లిలో రచ్చబండ విజయవంతం చేయండి

**- మండల ఇన్‌చార్జ్ యనమల మదన్మోహన్**



**లక్కిరెడ్డిపల్లి - సూర్యవాస్తవం, జులై 29:** సుపరి పాలనను తొలి అడుగు(4.1 )డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా నేడు లక్కిరెడ్డిపల్లిలో రచ్చబండ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొంటున్నారని లక్కిరెడ్డిపల్లి మండలం ఇన్చార్జి యనముల మదన్ మోహన్ తెలియజేశారు. మండలంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభిస్తున్నట్టు తెలియజేశారు. బుధవారం నాడు లక్కిరెడ్డిపల్లి మండలం చింతకుంటపల్లి దగ్గర భారీగా రచ్చబండ కార్యక్రమంలో మండల ప్రజలతోపాటు మండిపల్లి అభిమానులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, మాజీ జెడ్పిటిసి రెడ్డియ్య యాదవ్, జయ రాములు, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొండూరు వెంకటరామరాజు,సిద్ధక వెంకటరామిరెడ్డి, దేవేంద్రారెడ్డి, గురు స్వామి సోడి వెంకటేశ్వర యాదవ్, బుల్లెట్ రాజు, పాపయ్య, కావలి ఆంజనేయులు, సయ్యద్ మసూద్, డీలర్ అన్వర్ దండే శ్రీను, ముక్తార్ అహ్మద్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

### పాఠశాలలకు వెళ్లే

## ఆడపిల్లలను ఏడిపిస్తే కఠిన చర్యలు తప్పవు

**- లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు**



**లక్కిరెడ్డిపల్లి - సూర్యవాస్తవం, జులై 29:** పాఠశాలలకు వెళ్లే ఆడపిల్లలను కొంతమంది ఆకతాయిలు ఏడిపిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకొని తాటతీస్తామని ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల వద్దకు వెళ్లి ఆడపిల్లలను కొంతమంది ఆకతాయిలు ఏడిపిస్తున్నారని అలాంటివారిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. రవీంద్ర నగర్ మర్రిచెట్టు వద్ద కొంతమంది ఆకతాయిలు ద్విచక్ర వాహనంలో వచ్చి ఆడపిల్లలను ఏడిపిస్తున్నారని వారి సమాచారం పోలీసులకు అందిస్తే వెంటనే వారిని అదుపులో తీసుకొని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకోవాలని ఆయన వారికి ధైర్యాన్ని నింపారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఇలాంటి ఆకతాయిలకు భయపడి పాఠశాలను మానుకోవద్దని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, అధ్యాపకులు రాజశేఖర, షర్ఫుద్దీన్, రామ్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజలకు భరోసా





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 29:** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదే శాలతో జిల్లా వ్యాప్తంగా సాయ ంత్రం నుండీ విజిబుల్ పోలీసింగ్ చేపట్టి వాహనాల తనిఖీలు నిర్వహించారు పోలీసులు. ఆటోల ఓవ ర్లోడ ింగ్, త్రిబుల్ రైడింగ్, డ్రంకన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, తదితరాలపై చర్యలు తీసుకున్న పోలీసులు ... ఉల్లంఘన దారులకు జరిమానా విధింపు మరియు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ప్రజల భద్రత, భరోసా కల్పిస్తూ విజిబుల్ పోలీసింగ్, నేరాలు జరగకుండా కట్టడి చేస్తూ నిఘా వేసారు.అంతేకాకుండా గ్రామ సభలు నార్వహించి సైబర్ నేరాలు, గంజాయి అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగి ఉండాలని... ఇలా పలు విషయాలపై అవగాహన చేశారు.

## భర్త ఆత్మహత్య - భార్య అరెస్ట్



**కుప్పం- సూర్య వాస్తవం,జూలై 29:** భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటనలో భార్యను అదుపులోనికి తీసుకున్నట్టు కుప్పం పట్టణ పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం మండలం వేపూరు మిట్టపల్లి గ్రామానికి చెందిన భార్గవి అదే గ్రామానికి చెందిన షేక్ సమీర్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ విషయం తెలిసిన ఆమె భర్త కుపేంద్ర పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినట్లు తెలిపారు. భార్య భర్తగా మధ్య సామరస్యం కుదిర్చిన పెద్దలు అక్రమ సంబంధానికి పాల్పడ్డ వారిని మందలించి, తిరిగి ఇలాంటి తప్పు చేయకుండా సక్రమంగా ఉండాలంటూ సర్ది చెప్పినట్టు తెలిపారు. అయినా భార్గవి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో మనస్థాపానికి గురైన ఆమె భర్త ఈనెల 26వ తేదీ తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేస్తున్నట్టు తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నాడు నిందితులను అదుపులోనికి తీసుకుని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

## రైలులో నుంచి పడి
## విద్యార్థికి తీవ్ర గాయాలు



**మదనపల్లె - సూర్య వాస్తవం,జూలై 29:** రైలులో నుంచి పడి విద్యార్థి తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం సాయంత్రం కురబ లకోట మండలంలో జరిగింది. ఘటనపై కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ భాష తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా, కదిరి పట్టణంలో కాపురం ఉంటున్న నజీర్ భాష కుమారుడు సఫాన్(18) తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటికి వచ్చి రెండు రోజుల పాటు ఇంటిపట్టునే ఉండి పోయాడు. కాగా మంగళవారం తిరిగి తిరుపతిలోని కళాశాలకు కదిరి నుండి రైల్లో తిరుపతికి వెళు తుండగా, మార్గమధ్యంలోని, కురబలకోట సమీపంలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని కురబలకోట 108లో చికిత్స కోసం వెంటనే మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నాడు. కేసు దర్యాప్తులో ఉందని హెచ్ సి బాష తెలిపారు.

## పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 29 :** పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నట్టు కుప్పం నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు,18 వ వార్డు కౌన్సిలర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. కుప్పం పట్టణంలోని 3వ సచివాలయంలో మంగళవారం నాడు జరిగిన పి4 సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని సమాజ స్థాపనకు పి4 సర్వే ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.

పేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్విరామంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆయన సూచనల మేరకు కుప్పం పరిధిలో పేదరిక నిర్మూలనకు స్థానిక నాయకులు, ప్రభుత్వాధికారులు పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి జాను భాష, కవిత, వీఆర్వో రాయుడు తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

**విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్న శక్తి బృందాలు**





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 29:** గంజాయి, తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని... ఒక్కసారి అలవాటు పడితే అవి మీ జీవితాన్ని మరియు మీ చుట్టూ ఉన్న వారి జీవితాలను నాశనం చేస్తాయి. మీకు ఎవరికైనా మాదకద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని... మాదక ద్రవ్యాలు లేని సమాజ నిర్మాణంలో మీరు కూడా భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధించడం జరుగుతుందని మరియు ఎవరైనా మైనర్ లు వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు ఆ తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ద్విచక్ర వాహనంలో ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, రహదారిపై మీ కళ్ళ ముందు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వెంటనే డయల్ 100/112 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రతి ఒక్కరూ బాధ్యత గల పౌరులుగా రహదారి భద్రత నియమాలను పాటించి మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి వివరి ంచారు. బాలికలు/మహిళలు ఏదైనా ఆపద సమయంలో డయల్ 100/112 కు ఫోన్ చేసి పోలీసులు వారి సహా యాన్ని తక్షణమే పొందాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు శక్తి యాప్ ను తమ సెల్ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవాలని తద్వారా పోలీసుల తక్షణ సహాయం అందుతుందని తెలియజేశారు.అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే లింక్‌లపై క్లిక్ చేసేటప్పుడు లేదా డౌన్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. వ్యక్తిగత సమాచారాన్ని లేదా ఓటీపీలను ఎవరితోనూ పంచుకోకూడదు. మొబైల్ దొంగతనం, సైబర్ క్రైమ్, ఫేక్ లోన్ యాప్స్ మోసాల గురించి వివరించి, అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులు అంగీకరించవద్దు.మీ వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవద్దు.వాటిని ఎలా ఎదుర్కోవా లో ముందస్తు జాగ్రత్తలను వివరించారు.ఎవరైన సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 కి కాల్ చేసి గాని www.cybercrime.gov.in లో 24 గంటల లోపల ఫిర్యాదు చేయండన్నారు. క్రమ శిక్షణతో బాధ్యత గా చదువుకొని మీ తల్లిదండ్రులకు సమాజానికి ఉపయోగ పడాలని సూచించారు. విద్యార్థి దశ నుండి మంచి క్రమశిక్షణ కలిగి, చదువుకున్నటువంటి వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ అవగాహన కార్యక్రమంలో తెలియజేశారు.



# ప్రభుత్వ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోండి

**- కుప్పం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాస రావు**



**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 29 :** కుప్పం పట్టణ పరిధిలోని అనధికారిక లేఅవుట్ల యజమానులు, సైట్ల యజమానులు ప్రభుత్వం అందిస్తున్న సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. పగటి కార్య అవుట్లపై అవగాహన కల్పిస్తూ పురపాలక సంఘం కార్యాలయం నందు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పట్టణ పరిధిలో అనధికారిక లేఅవుట్లు వేసిన వారు, వారి లే అవుట్ లకు సంబంధించిన అనుమతులను పొందాలని సూచించారు. అలాగే కారిక లేఅవుట్లలో సైట్లు కొన్నవారు వారి సైట్లకు ప్రభుత్వ అనుమతులు పొందడానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు 2025 జూన్ 30వ తారీకు లోపున రిజిస్ట్రేషన్ పొందిన సైట్ల యజమానులు ఎల్ ఆర్ ఎస్ స్కీముకు అర్హులని తెలిపారు. ఈ అవకాశం జూలై 26వ తేదీ నుండి 90 రోజులపాటు కొనసాగు తుందన్నారు. ఎంతోకాలంగా పరిష్కారం పొందని ప్లాట్లను క్రమబద్ధీ కరించుకొనేందుకు ఇది సువర్ణ అవకాశమని తెలిపారు. కావున సదరు యజమానులు ప్లాట్ల క్రమ బద్ధీ కరణకు ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్లాట్ల క్రమబద్ధీ కరించుకోవడం వల్ల భవన నిర్మాణ అనుమతులలో అపరాధ రుసుము నుండి మిన హాయింపు ఉంటుందని, మౌళిక వసతులైన సిమెంట్ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు మౌలిక సదుపాయాలని పురపాలక సంఘం ద్వారా సమ కూర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. అనధికార లే-అవుట్ నందు క్రయ విక్రయ చేసుకున్న ప్లాటులను క్రమ బద్ధీకరించుకోవడం వల్ల బ్యాంకు ద్వారా ఋణ సదు పాయం సులభతరంగా పొందవచ్చని తెలిపారు.

# మార్గదర్శుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ కోసం సన్నద్ధం కావాలి**

**- వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ**





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, జూలై 29 :** - పీ4 కార్యక్రమం కింద మార్గదర్శుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని ఎన్ఐసి భవనం హాల్ నుంచి జీరో పావర్టీ పీ4 కార్యక్రమం, పెన్షన్ల పంపిణీ, జి.ఎస్.డబ్ల్యు.ఎస్, తదితర అంశాలపై ఆయ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంచార్జి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో మార్గదర్శులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీ4 కార్యక్రమంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, జిల్లాలో ఇప్పటివరకు 18 వేలకుపైగా బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వడం జరిగిందన్నారు. డిపిఓ, జిల్లా పరిషత్, డిఆర్డిఏ, మైన్స్, పరిశ్రమలు, లీగల్ మెట్రాలజీ, కాలేజీ ఎడ్యుకేషన్, ఫుడ్ ఇన్స్పెక్టర్, కమర్షియల్ టాక్స్, రెవెన్యూ, డ్రగ్స్, మెప్మా, తదితర శాఖల పరిధిలో స్టేక్ హోల్డర్లకు అవగాహన కల్పించి మార్గదర్శులను గుర్తించాలన్నారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకుని మార్గదర్శుల గుర్తింపులో వెంటనే పురోగతి తీసుకురావాలన్నారు.ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆగస్టు 1వ తేదీన పెన్షన్ల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. 1వ తేదీన ఉదయం 7 గంటలకి పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం ఒకరోజు ముందుగానే బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకర్లతో మానిటర్ చేసి ఎలాంటి సమస్యలు లేకుండా చూసు కోవాలని ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ కోసం నియోజకవర్గ, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి ఐవిఆర్ఎస్ కాల్స్ ఫీడ్ బ్యాక్ రావడం జరుగుతుందని, అందులో నెగటివ్ ఫీడ్ బ్యాక్ రాకుండా పెన్షన్లను పంపిణీ చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలు అయిన నేపథ్యంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి పెట్టి ఇబ్బంది లేకుండా పెన్షన్ల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.- జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలను ఎలాంటి పెండింగ్ లేకుండా ప్రాధాన్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్- చైల్డ్ ఈకేవైసీ, తల్లికి వందనం గ్రీవెన్స్, ఏపీ సేవా సర్వీసెస్ డాష్ బోర్డు, మన మిత్ర క్యాంపెయిన్ లో పెండింగ్, సిటిజన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటా పెండింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ తక్కువగా నమోదవుతోందని, పూర్తిగా నమోదయ్యేలా దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, సిపిఓ అశోక్ కుమార్, డిపిఓ నాగరాజు నాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిఆర్డీఏ పిడి శైలజ, మైన్స్ డిడి ఆదినారాయణ, డ్వామా పిడి సలీమ్ భాష, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, మెప్మా పిడి విశ్వజ్యోతి, జిల్లా పరిశ్రమల శాఖ జడ్ఎం శ్రీనివాసరావు, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సూర్య వాయిస్ ఓవర్ పై విజయ్ కామెంట్లు..

**- కింగ్ డమ్ సినిమా ప్రమోషన్స్ జోరు పెంచిన విజయ్ దేవరకొండ**
**- రిలీజ్ ఇంకా రెండు రోజులు మాత్రమే ..**

విజయ్ దేవరకొండ కింగ్ డమ్ సినిమా ప్రమోషన్స్ జోరు పెంచాడు. రిలీజ్ ఇంకా రెండు రోజులు మాత్రమే ఉంది. ఈ టైంలో విజయ్ దేవరకొండ సాధ్యమైనంత వరకు ప్రమోట్ చేస్తున్నాడు. లేటెస్ట్ గా నేడు కింగ్ డమ్ తమిళ్ ప్రమోషన్స్ లో పాల్గొన్నాడు విజయ్. అక్కడ కింగ్ డమ్ టీజర్ కి వాయిస్ ఓవర్ ఇచ్చిన కోలీవుడ్ స్టార్ సూర్య గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు విజయ్ దేవరకొండ. సూర్ పవర్ ఫుల్ వాయిస్.. కింగ్ డమ్ టీజర్ కి వాయిస్ ఓవర్ కావాలని అన్నప్పుడు తెలుగులో ఎన్టీఆర్ అన్న చేశాడు. తమిళ్ లో ఒక పవర్ ఫుల్ వాయిస్ కావాలంటే గౌతం సూర్య అన్న పేరు చెప్పాడు. ఆ టైం లో తాను సూర్య అన్నకి కాల్ చేసి గౌతం తిన్ననూరి సినిమా టీజర్ గురించి చెప్పి అతనికి నో చెప్పమని చెప్పా.. కానీ సూర్య అన్న అదేం లేదు వాయిస్ ఓవర్ ఇస్తానని చెప్పి సపోర్ట్ చేశారు. కింగ్ డం తమిళ్ టీజర్ కి సూర్య అన్న పవర్ ఫుల్ వాయిస్ చాలా ప్లస్ అయ్యిందని అన్నాడు విజయ్ దేవరకొండ. కాస్త బ్యాక్ కి వెళ్తే సూర్య రెట్రో తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ కి విజయ్ దేవరకొండ వచ్చాడు. ఆ టైం లో సూర్య తనకు ఇచ్చే సపోర్ట్ గురించి ప్రత్యేకంగా చెప్పాడు విజయ్. కింగ్ డమ్ సినిమా టీజర్ కి తెలుగులో తారక్, తమిళ్ లో సూర్య, హిందీలో రణ్ బీర్ కపూర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఆ టీజర్ ఇంపాక్ట్ తోనే కింగ్ డమ్ పై అంచనాలు పెరిగాయి. విజయ్ ఒక సాలిడ్ హిట్ కొట్టాలని.. కింగ్ డమ్ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా మీద విజయ్ దేవరకొండ చాలా హోప్స్ పెట్టుకున్నాడు. సినిమాతో విజయ్ ఒక మంచి సాలిడ్ హిట్ కొట్టాలని చూస్తున్నాడు. ఐతే కింగ్ డమ్ ప్రమోషనల్ కంటెంట్ చూస్తుంటే మంచి స్టఫ్ ఉన్న సినిమాగానే అనిపిస్తుంది. మరి కింగ్ డం విజయ్ కోరిక నెరవేరుస్తుందా లేదా అన్నది చూడాలి. విజయ్ దేవరకొండ కింగ్ డమ్ సినిమాలో భాగ్య శ్రీ హీరోయిన్ గా చేసింది. అనిరుద్ రవిచందర్ మ్యూజిక్ అందించిన ఈ సినిమాలోని అన్ని సాంగ్స్ ఇంకా బిజిఎం మ్యూజిక్ లవర్స్ ని ఎట్రాక్ట్ చేయనున్నాయి.

# విశ్వంభర ప్రపంచమే వేరట!

**టీజర్ లోని వీఎఫ్ఎక్స్ కు నెగిటివ్ రెస్పాన్స్ రావడంతో చిత్ర యూనిట్ ఆ టీమ్ ను మార్చి కొత్త వారికి వీఎఫ్ఎక్స్ వర్క్స్ బాధ్యతల్ని అప్పచెప్పింది**

గత కొన్ని సినిమాలుగా ఫ్లాపుల్లో ఉన్న మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వశిష్ట దర్శకత్వంలో విశ్వంభర అనే సోషియో ఫాంటసీ సినిమాతో పాటూ అనీల్ రావిపూడి దర్శకత్వంలో మెగా157ను కూడా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ముందుగా ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమా విశ్వంభర. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్ రిలీజైంది. విశ్వంభరపై భారీ అంచనాలు టీజర్ లోని వీఎఫ్ఎక్స్ కు నెగిటివ్ రెస్పాన్స్ రావడంతో చిత్ర యూనిట్ ఆ టీమ్ ను మార్చి కొత్త వారికి వీఎఫ్ఎక్స్ వర్క్స్ బాధ్యతల్ని అప్పచెప్పింది. సోషియో ఫాంటసీ సినిమా కావడంతో ఈ సినిమాకు ఎక్కువగా విజువల్ ఎఫెక్ట్స్ అవరసరమవుతుంది. చాలా ఏళ్ల తర్వాత చిరూ నుంచి వస్తున్న సోషియో ఫాంటసీ మూవీ అవడంతో విశ్వంభరపై అందరికీ మంచి అంచనాలున్నాయి. చిరూ సరసన ఐదుగురు భామలు ఇదిలా ఉంటే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ వశిష్ట సినిమాలోని క్యాస్టింగ్ మరియు కొత్త విషయాలను వెల్లడించారు. విశ్వంభర సినిమాలో మొత్తం ఐదుగురు హీరోయిన్లు నటిస్తున్నారని వశిష్ట కన్ఫర్మ్ చేశారు. అందులో భాగంగానే త్రిష లీడ్ హీరోయిన్‌గా నటిస్తుంటే, ఆషికా రంగనాథన్ సెకండ్ హీరోయిన్‌గా నటిస్తున్నారని, మిగిలిన ముగ్గురూ కథలో భాగంగా కనిపిస్తారని, ఆ ఐదుగురు హీరోయిన్లూ సినిమాకు చాలా కొత్తదనాన్ని తీసుకొస్తారని వశిష్ట చెప్పారు. అందుకే అవతార్ తో పోలిక అయితే విశ్వంభర సినిమాను అవతార్ తో పోలుస్తున్న విషయంపై కూడా డైరెక్టర్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. సినిమాలో విజువల్స్ ఆ కామెంట్స్ కు కారణమై ఉంటాయని, కానీ విశ్వంభర కథ, ఆ సినిమా కోసం తాను సృష్టించిన ప్రపంచం మొత్తం వేరే అని స్పష్టం చేశారు. విశ్వంభర రిలీజ్ ఆలస్యమవడానికి కారణం విజువల్స్ ఎఫెక్ట్స్ వర్క్సేనని ఆయన పేర్కొన్నారు.

మెగా157కు పూర్తి భిన్నంగా.. అనిల్ రావిపూడితో మెగాస్టార్ చేస్తున్న మెగా157 కథకు, విశ్వంభర సినిమా చాలా భిన్నంగా ఉంటుందని, తాము తీసిన సినిమాపై తాను చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నామని, ఎక్కడా ఎలాంటి ప్రెజర్ ఫీలవడం లేదని వశిష్ట చెప్పారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న విశ్వంభరకు పోస్ట్ ప్రొడక్షన్ అయిపోయి, వీఎఫ్ఎక్స్ తనకు నచ్చితే అప్పుడే సినిమా రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయనున్నట్టు వశిష్ట తెలిపారు. ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.





# ఐపీఎల్ వల్ల తల్లడిల్లుతున్న టెండూల్కర్ వారసత్వం?


**- ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ బోర్డు అయినా, టెస్ట్ క్రికెట్‌కు తీసుకుంటున్న తీరును చూసినప్పుడు మాత్రం దురదృష్టం అనిపించకమానదు**



క్రికెట్ ప్రపంచంలో టెస్ట్ క్రికెట్ అంటేనే అసలైన గౌరవం, క్రికెట్ మాతృరూపం. ఈ క్రికెట్‌కు నిస్సహాయంగా జోడైన ఒక గొప్ప పేరు జో రూట్. ప్రస్తుతం అతను 13,409 పరుగులతో టెస్ట్ క్రికెట్‌లో రెండవ స్థానానికి ఎగబాకాడు. ఇప్పుడు అతని ముందు ఉన్నది ఒక్కటే రికార్డు... మన భారతీయులంతా గర్వంగా నిలిచిన సచిన్ టెండూల్కర్ చెందిన 15,921 పరుగుల గణాంకం. విశ్లేషకుల అంచనాల ప్రకారం, ఈ రికార్డు కూడా 2027 నాటికి రూట్ బ్రేక్ చేయనున్నాడని నిపుణుల అభిప్రాయం. దీనికి ముఖ్య కారణం ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఇసీబి తీసుకుంటున్న దృధ నిర్ణయాలు. ఇసీబి జట్టు ఎక్కువగా టెస్ట్ మ్యాచ్‌లు ఆడేలా చేస్తోంది, దీని వలన రూట్‌కు అనుభవం, అవకాశాలన్నీ సమకూరుతున్నాయి. ఆట పరంగా మాత్రమే కాదు, రికార్డుల పరంగా కూడా అతనిని తలపడదగినవాడిగా తీర్చిదిద్దుతున్నారు. బీసీసీఐ వైఖరి: ఐపీఎల్‌పైనే దృష్టి! ఇంకో వైపు మన భారత క్రికెట్ నియంత్రణ మండలి ( బిసిసిఐ దృష్టంతా మాత్రం డబ్బు సంపాదించే టోర్నీ ఐపీఎల్‌పైనే ఉంది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ బోర్డు అయినా, టెస్ట్ క్రికెట్‌కు తీసుకుంటున్న తీరును చూసినప్పుడు మాత్రం దురదృష్టం అనిపించకమానదు. ఒకప్పుడు మన యువత అంతా టెస్ట్ మ్యాచ్‌ల ద్వారానే తళుక్కుమంది. ఇప్పుడు వారికి ఆ అవకాశమే తక్కువ. ఐపీఎల్ సీజన్‌కు సమయం కల్పించాలనే ఉద్దేశంతో టెస్ట్ , వన్డే మ్యాచ్‌లు ముడిచేస్తున్నారు. 5 వన్డేల సిరీస్‌లు మూడు మ్యాచ్‌లకు తగ్గిపోయాయి. టెస్టులకు అసలు ప్రాధాన్యం తగ్గిపోయింది. వైరల్ వీడియో దీర్ఘకాలిక నష్టాలు ఐపీఎల్ వల్ల భారత క్రికెట్‌కు వచ్చిన లాభాలు ఉన్నా, దీర్ఘకాలంలో మనం క్రీడా మూలాలను కోల్పోతున్నాం. టెస్ట్ క్రికెట్ అనేది ఆటగాళ్ల అసలైన నైపుణ్యాన్ని పరీక్షించే మైదానం. అది తగ్గిపోతే, రేపటి తరం ఆటగాళ్లు ఏ పటుత్వాన్ని సంపాదించగలరు? తక్షణమే మేల్కొనాలి! ఇప్పుడు తక్షణమే బిసిసిఐ మేల్కొనాలి. ఐపీఎల్‌ను కొనసాగించడమే కాకుండా, టెస్ట్ క్రికెట్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. లేదంటే సచిన్‌లాంటి గౌరవాలు, గర్వించదగ్గ గణాంకాలు మనకు చరిత్రలో మాత్రమే మిగిలిపోతాయి. ఇప్పుడు ప్రశ్న ఇదే జో రూట్ రికార్డు సాధించడం పట్ల గర్వపడాలా? లేక మన క్రికెట్‌ను తామే తక్కువ చేసి, గుండెగాయం అయినట్లు భావించాలా? సమాధానం మాత్రం మన చర్యల్లో ఉంది.

# ప్రపంచ చదరంగానికి కొత్త మహా'రాణి'..

**- ఎవరీ 'దివ్య'మైన అమ్మాయి? తెలుగు తేజాలు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలూ దానిని సాధించలేకపోయారు. కానీ, ఇప్పుడు దివ్య దేశ్‌ముశ్ రూపంలో ఓ కొత్త మహా'రాణి' పుట్టుకొచ్చింది**



మొన్న గుకేశ్ దొమ్మరాజు... నేడు దివ్య దేశ్‌ముఖ్.. ప్రపంచ చదరంగ వేదికపై భారత కీర్తి పతాకం రెపరెపలాడింది.. ఎన్నో దశాబ్దాలుగా భారత అమ్మాయిలు, మహిళలు చదరంగంలో గొప్ప విజయాలు సాధిస్తున్నా.. ప్రపంచ చాంపియన్లుగా మాత్రం నిలవలేకపోయారు. తెలుగు తేజాలు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలూ దానిని సాధించలేకపోయారు. కానీ, ఇప్పుడు దివ్య దేశ్‌ముశ్ రూపంలో ఓ కొత్త మహా'రాణి' పుట్టుకొచ్చింది. ఫిడే ప్రపంచ మహిళల చెస్ చాంపియన్‌గా నిలిచిన దివ్య కేవలం 19 ఏళ్ల వయసుకే అత్యంత గొప్ప విజయం సాధించినట్లైంది. దీంతో ఆమె గురించి ఆరా తీయడం మొదలైంది. వైరల్ వీడియో తెలుగు తేజం కోనేరు హంపికి నిరాశ... ఎవరు గెలిచినా చరిత్రే.. ఎవరు గెలిచినా మన దేశానికి రికార్డే.. కానీ, అందులో ఒకరు తెలుగమ్మాయి కావడంతో సహజంగానే మనవాళ్లంతా కోనేరు హంపి విజయం సాధించాలని కోరుకున్నారు. అయితే, రెండు గేమ్‌లు డ్రా కావడంతో ఫిడే ప్రపంచ మహిళల చెస్ చాంపియన్ ఫైనల్ టై బ్రేక్‌కు దారితీసింది. ఇందులో దివ్య దేశ్‌ముఖ్‌దే పైచేయి అయింది. తొలి ర్యాపిడ్ టై బ్రేకర్ డ్రా అయింది. రెండో గేమ్‌లో 75 ఎత్తుల్లో దివ్య గెలుపొందింది. ఈ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన ఆమె చరిత్ర సృష్టించారు. దీంతో హంపీకి నిరాశ తప్పలేదు. ఫిడే ప్రపంచ మహిళల చెస్ చాంపియన్ ఫైనల్స్ చేరిన తొలి భారత క్రీడాకారిణి దివ్యనే. అనంతరం హంపి కూడా ఫైనల్ చేరడంతో పతకం మన దేశానికే ఖాయమైంది. ఇక విజేతగా నిలవడం ద్వారా దివ్య.. ఫిడే ప్రపంచ మహిళల చెస్ చాంపియన్ అయిన తొలి భారతీయురాలిగానూ రికార్డులకెక్కింది. ఫైనల్ స్కోరు చూస్తేఏ... దివ్య 1.5, హంపి 0.5 పాయింట్లు సాధించారు. కాగా, హంపి ఇప్పటికే గ్రాండ్ మాస్టర్. దివ్య మాత్రం ఫిడే ప్రపంచ మహిళల చెస్ చాంపియన్ కావడం ద్వారా గ్రాండ్ మాస్టర్ కానున్నారు. ఇప్పటివరకు భారత్ లో గ్రాండ్ మాస్టర్ హోదా దక్కిన 88వ చెస్ ప్లేయర్ దివ్య. 19 ఏళ్ల ఈ అమ్మాయి పుట్టక మునుపే లేదంటే, బుడిబుడి అడుగులు వేస్తున్నప్పుడే హంపి గ్రాండ్ మాస్టర్ అయింది. అలాంటి దివ్య నేడు అద్భుత విజయంతో భారత చెస్ చరిత్రలో కొత్త అధ్యాయం రాసింది. సీనియర్ స్థాయిలో టోర్నీలు ఆడకున్నా.. హంపి వంటి ప్లేయర్‌ను ఒత్తిడికి గురిచేసింది. నాలుగేళ్ల కిందటే ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించింది దివ్య. 2023లో ఆసియా చాంపియన్‌గా నిలిచింది. ఒలింపియాడ్‌లో మూడు గోల్డ్‌లు గెలుపొందింది. నిరుడు తొలిసారి 2,500 ఎలో రేటింగ్ సాధించింది. ఆటలో దూకుడు దివ్య బలం. ఫిడే ప్రపంచ మహిళల చెస్ చాంపియన్‌షిప్‌లోనూ దానిని ఆయుధంగా మలుచుకుని.. తనకంటే మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక (క్వార్టర్స్), జు జినర్ (ప్రి క్వార్టర్స్)లను మట్టికరిపించింది. ప్రపంచ మాజీ చాపియన్ జాగ్‌యిను సెమీఫైనల్లో చిత్తు చేసింది.

# ఆదాయం తగ్గిందా..లెక్కలు ఏం చెబుతున్నాయ్



**విజయవాడ- సూర్య వాస్తవం:** పాలనలో ఒక్కొక్కరిది ఒక్కో విధానం. కొందరు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించడం ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరిగి ప్రభుత్వ ఆదాయం పెంచుకోవాలని చూస్తారు. మరికొందరు నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా నగదును అందించి.. వారిలో ఆర్థిక అభివృద్ధి పెంచాలని చూస్తారు. తద్వారా వారికి కొనుగోలు శక్తి పెరిగి పనుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని భావిస్తారు. అయితే ఇందులో మొదటి అంశాన్ని ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎంచుకున్నారు. రెండో మార్గాన్ని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేశారు. అయితే చంద్రబాబు ఆలోచనలు దూర దృష్టితో ఉంటాయి. భవిష్యత్తు తరాల ప్రయోజనాలు, వారికి ఉత్తమ ఉపాధితో పాటు ఉద్యోగాలు అందించేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. అందులో భాగమే ఐటీ రంగం. అయితే ఇక జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను విపరీతంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో డబ్బు చలామని పెంచారు. తద్వారా ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచారు. అయితే ఇంత చేసిన ఏపీలో ఆర్థికాభివృద్ధి పెరగకపోవడం, ప్రభుత్వ ఆదాయం జరగకపోవడం ఆందోళన కలిగించే విషయం ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోయి కూడా ఏడాది అవుతోంది. అయితే 2025 ? 26 ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసికంలో ఏపీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దిగజారిందని జగన్ ఆరోపించారు. గణాంకాలతో సహా పేర్కొన్నారు. ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేశారు. రాష్ట్ర ఆర్థిక స్థిరత్వం ప్రమాదంలో ఉందని జగన్ అభిప్రాయపడ్డారు. అయితే జగన్ కంట్రోల్ అండ్ ఆడిటర్ జనరల్ కాగ్ నివేదికలతో సహా వెల్లడించడం విశేషం. ఇదేనా సంపద పెంచడం అంటూ జగన్మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. దీంతో ఇది వైరల్ అంశంగా మారింది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం లో.. రాష్ట్ర సొంత ఆదాయం కేవలం 3.47% మాత్రమే. కేంద్రం నుంచి వచ్చిన నిధులు అన్నీ కలిపి చూస్తే ప్రభుత్వ ఆదాయంలో మొత్తం 6.14% వృద్ధి మాత్రమే ఉంది. అదే సమయంలో రాష్ట్ర హక్కులు ఏకంగా 15.61 శాతం పెరగడం దారుణం. దీనిని ఉదహరిస్తూ చెప్పారు జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రంలో సంపద సృష్టి, ఆదాయం పెంపొందించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.అయితే కూటమి పెద్దలు బాగానే కష్టపడుతున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చేలా ఉన్నాయి. మరోవైపు పింఛన్ల లబ్ధిదారుల కు వెయ్యి రూపాయల పెంచి అందిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణం జరుగుతుంది. పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పన జరుగుతోంది.

అయినా సరే ప్రభుత్వానికి నేరుగా ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడం ఏమిటి అనేది చర్చ. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు అప్పుల మీద ఆధారపడడం ఏమిటనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మిగులుతోంది. ఇంత పెద్ద పరిశ్రమలు వస్తున్నాయి. పెట్టుబడులు వస్తున్నాయి. కానీ పనుల రూపంలో ఆదాయం పెరగడం ఏమిటి అనేది ఒక రకమైన ప్రశ్న.అయితే చంద్రబాబుఆలోచనలన్నీ భవిష్యత్తు తరాలను ఆలోచించుకొని ఉంటాయి. అయితే ఆ ఆలోచనల ఫలితాలు రావడానికి చాలా సమయం పడుతుంది. 1995లో అధికారం చేపట్టారు చంద్రబాబు. అప్పటినుంచి 2004 వరకు ఐటీ పరిశ్రమలపై ఎక్కువగా దృష్టి పెట్టారు. రసాయన రంగానికి ప్రోత్సాహం అందించారు. కానీ వాటి ఫలితాలు 2004 తర్వాత వచ్చాయి. అప్పటికే చంద్రబాబు అధికారానికి దూరమయ్యారు. రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చారు చంద్రబాబు. ఆ సమయంలో అనంతపురం జిల్లాకు కియో పరిశ్రమలను తెప్పించారు. కానీ ఆ పరిశ్రమ ఉత్పత్తులను ప్రారంభించింది 2019 తర్వాత. ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా అప్పటినుంచి ప్రారంభం అయింది. అంటే ముందు ప్రభుత్వాలు చేసిన ఫలితాలు తర్వాత ప్రభుత్వాలు అనుభవిస్తాయన్నమాట. అయితే ఈ విషయంలో చంద్రబాబు ముందు చూపు.. తరువాత ప్రభుత్వాలకు ఎంతో మేలు చేశాయి.ప్రస్తుతం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తుండడం వాస్తవం. ప్రపంచ దిగ్గజ సంస్థలు సైతం వస్తుండడం నిజం. అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయడం కూడా అంతే వాస్తవం. అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం కావడం కూడా నిజం. అయితే ఇవి సన్నాహాల్లో మాత్రమే ఉన్నాయి. ఇంకా పూర్తిస్థాయిలో పనులు ప్రారంభం కాలేదు. ప్రారంభమైన మరుక్షణం నుంచి పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది.

నిర్మాణ రంగంలో ఉత్పత్తులపై వచ్చే పన్నులు పెరుగుతాయి. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్నారు సీఎం చంద్రబాబు. అక్కడ స్థిరపడిన చాలామంది ప్రవాస ఆంధ్రులు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. అయితే అలా ఒప్పుకున్న వెంటనే ఏపీ ప్రభుత్వానికి ఆదాయం పెరగదు. పెట్టుబడులు పెట్టి ఉత్పత్తులు ప్రారంభించిన తర్వాతే ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. అయితే ఇప్పుడు ఏపీ ఆర్థిక పరిస్థితి మరింతగా ముందుకు కదలక పోవడానికి ఆదాయం సమకూరకపోవడమే కారణం. కానీ జగన్మోహన్ రెడ్డి సైతం అభివృద్ధి పనులు చేపట్టలేదు. పరిశ్రమలను తెప్పించలేదు. కానీ ముందు ప్రభుత్వం చేసిన పనులు ఫలితాలు.. తరువాత ప్రభుత్వంగా జగన్ దక్కించుకున్నారు. ఇప్పుడు కూడా అదే జరిగింది. జగన్ సర్కార్ చర్యలు పుణ్యమా అని ప్రస్తుత ప్రభుత్వానికి ఆదాయం తగ్గినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 1,000 కోట్లతో 2,000 కి.మీ. కొత్త రోడ్లు


**విశాఖపట్టణం- సూర్య వాస్తవం:**

ఏపీలో రోడ్లకు మహర్దశ రానుంది.రూ.1,000 కోట్లతో 2,000 కి.మీ. కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదే శించారు. అంతేకాకుండా మరో రూ.500 కోట్లతో రహ దారులకు మరమ్మత్తులు చేయాలని నిర్ణయి ంచారు. రాష్ట్రంలోని 2,000 కిలోమీటర్ల మేర రాష్ట్ర, జిల్లా రహదారులను రూ.1,000 కోట్లతో కొత్తగా నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి అంచనాలు, టెండర్ల ప్రక్రియను వెంటనే మొదలుపెట్టాలని సూచించారు. మరో రూ.500 కోట్లతో రాష్ట్రంలో దెబ్బతిన్న మిగిలిన రహదారుల మరమ్మతులు వర్షాకాలంలోనూ కొనసాగించాలని... వీలున్నంత త్వరగా వీటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... రాష్ట్రంలోని రహదారుల పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రహదారుల నిర్మాణం, మరమ్మతులపై తీవ్ర నిర్లక్ష్యం చూపడంతో అధ్వాన్నంగా తయారయ్యాయని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో ఇంకా ఎన్ని రోడ్లు మరమ్మతులు చేయాలి..? ఏవి కొత్తగా నిర్మించాలి..? నిర్వహణకు ఏ రహదారులు ఇవ్వాలి... అనేదానిపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నిర్దేశించారు. మరోవైపు ఇప్పటికే రాష్ట్రంలో 20,000 కి.మీ. మేర రహదారులను గుంతలు లేకుండా మరమ్మతులు పూర్తి చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారుజాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర రహదారులు ఉండాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు “ప్రతీ రహదారి నిర్దేశిత ప్రమాణాలతో నిర్మించాలి. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ నుంచి కొత్త రహదారుల నిర్మాణం చేపట్టాలి. ఏ రోడ్డు ఏ కాంట్రాక్టర్ నిర్మించారు, ఎవరు మెయింటైన్ చేస్తున్నారు.. అనే వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి. ప్రతీ 50 కి.మీ. చొప్పున అన్ని రహదారులపై సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలోని అన్ని రహదారుల్లో మరమ్మత్తుల నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించి.. వర్షాకాలంలో రోడ్లు పాడవ్వకుండా కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలి” అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.12,653 కి.మీ పొడవున రాష్ట్ర హైవేలు ఉండగా... ఇందులో 20 కి.మీ. కన్నా పొడవైన రోడ్లను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. 20 కి.మీ. కన్నా పొడవైన రాష్ట్ర హైవేలు మొత్తం 260 వరకు ఉన్నాయి. అంటే 10,200 కి.మీ పొడవైన రాష్ట్ర హైవేలను పీపీపీ విధానంలో చేపట్టేందుకు వీలుంది.





# రాజకీయాలకు నల్లారి గుడ్ బై...



**తిరుపతి- సూర్య వాస్తవం:** మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయాలకు గుడ్ బై చెబుతారా? ఇక విశ్రాంతి మేలన్న నిర్ణయానికి వచ్చారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సుదీర్ఘకాలం చిత్తూరు జిల్లా రాజకీయాలలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు కిరణ్ కుమార్ రెడ్డి. అయితే అనూహ్యంగా ఆయనకు ముఖ్యమంత్రి పదవి వరించింది. కనీసం మంత్రి పదవి చేపట్టక పోయిన ఆయనకు.. ఏకంగా సీఎం పదవి లభించింది. దాదాపు మూడున్నర సంవత్సరాల పాటు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. పాలనలో తనకంటూ ఒక మార్కు చూపించారు. అయితే రాష్ట్ర విభజన ఒకవైపు.. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోవైపు.. కిరణ్ నాయకత్వానికి గుర్తింపు లేకుండా చేసింది. అయితే దాదాపు 11 సంవత్సరాలు ఎటువంటి పదవులు చేపట్టలేదు. ఒక విధంగా రాజకీయాలతో గ్యాప్ వచ్చింది. ఇటువంటి సమయంలో పొలిటికల్ రిటైర్మెంట్ ప్రకటించడమే మేలన్న నిర్ణయానికి కిరణ్ కుమార్ రెడ్డి వచ్చినట్లు తెలుస్తోంది.చిత్తూరు జిల్లాలో నల్లారి కుటుంబానికి ప్రత్యేక స్థానం. సుదీర్ఘకాలం నల్లారి అమర్నాథ్ రెడ్డి రాజకీయాలు చేశారు. 1987లో ఎమ్మెల్యేగా ఉంటూ మృతి చెందారు. దీంతో వాయల్పాడు అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. కిరణ్ కుమార్ రెడ్డి తల్లి సరోజినమ్మ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే 1989 ఎన్నికల్లో కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 1994లో మాత్రం ఓడిపోయారు. 1999, 2004, 2009 ఎన్నికల్లో గెలిచారు. ప్రభుత్వ చీఫ్ విప్ గా పదవి నిర్వహించారు. 2009లో అసెంబ్లీ స్పీకర్ అయ్యారు. అయితే రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడుగా మెలిగారు. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో రోశయ్య సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇక్కడి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా రాజీనామా చేశారు రోశయ్య. అలా 2010 సెప్టెంబర్ 25న ఏపీకి ముఖ్యమంత్రి అయ్యారు కిరణ్ కుమార్ రెడ్డి. తన మార్కు పాలనతో మంచి ఫలితాలు సాధించారు. కానీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజనతో నామరూపాలు లేకుండా పోయింది. దీంతో కిరణ్ కుమార్ రెడ్డి ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి సమైక్యాంధ్ర పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అది వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఐదేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. తర్వాత కాంగ్రెస్ పార్టీలో తిరిగి ప్రవేశించారు. కానీ అక్కడ ఉండలేక 2024 ఎన్నికలకు ముందు బిజెపిలో చేరారు. మొన్నటి ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా బిజెపి తరఫున పోటీ చేశారు కిరణ్ కుమార్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మిథున్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఓడిన నాటి నుంచి నియోజకవర్గంలో పెద్దగా కనిపించడం లేదు. హైదరాబాద్ తో పాటు బెంగళూరుకె పరిమితం అవుతున్నారు. మొన్నటికి మొన్న రాజ్యసభ పదవిని ఆశించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి వస్తుందని కూడా అంచనా వేసుకున్నారు. అయితే ఆ పదవులేవీ దక్కలేదు. అయితే రాజకీయంగా వచ్చిన గ్యాప్ కారణంగానే కిరణ్ కుమార్ వెనుకబడ్డారన్న టాక్ ఉంది. అయితే ప్రస్తుతం కిరణ్ కుమార్ రెడ్డి వయసు 63. ఈ సమయంలో పొలిటికల్ గా రిటైర్మెంట్ తీసుకుంటే బెటర్ అని ఆయన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. సన్నిహితుల వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

### - మేయర్ మహమ్మద్ వసీం విమర్శ




**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం, జూలై 29:** గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. నగరంలోని 32వ డివిజన్ పరిధిలో నిర్వహించిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపిందని విమర్శించారు. ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమన్నారు. కూటమి వైఫల్యాలను ఇంటింటా ఎండకడతామని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందన్నారు.వైసీపీ పాలనలో 32వ డివిజన్ పరిధిలోనే రూ 1.5కోట్లు మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వంలో అభిరుద్ధి ఊసే లేదని విమర్శించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్ భూషణ్,శ్రీనివాసులు,వైసీపీ నాయకులు దాదా ఖలందర్, భరద్వాజ్, కాకర్ల శీనా,శోభ,ఉషా, కుమార్,కిరణ్,సంతోష్, సుకుమార్, అశోక్, పెన్నోబిలేశు, జయరాం, జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బృందం పర్యటన



**గాండ్లపెంట-సూర్య వాస్తవం,జులై 29:** మండలంలో 3వ రోజు, కేంద్ర బృందం పర్యటనలో భాగంగా మద్దివారిగొంది గ్రామపంచాయతీలోజరిగిన సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు అయిన దయాకర్ రెడ్డి ఫించను దారులతో, డ్వాక్రా మహిళలతో, హౌసింగ్ లబ్ధిదారులతో,ఉపాధి హామీ పథకం వేతనదారులతో ముఖాముఖి మాట్లాడడం, వారి సమస్యలు వినడం, రికార్డులు పరిశీలించడం జరిగినది. తర్వాత హౌసింగ్, పంచాయతీరాజ్ రోడ్డు, ఉపాధి హామీ పథకంలో అమలు పరచినవి వివిధ రకాల పనులు అనగా, రింగ్ ట్రేన్ చులు, హార్టికల్చర్, చెరువులో పూడిక తీత, కొండల్లో త్రవ్విన ఖండిత కందకాలు వంటి వాటిని స్వయంగా తనిఖీ చేసి, రికార్డుల ప్రకారం కొలతలను పరిశీలించి, పనుల నాణ్యతను కూడా పరిశీలించడం జరిగినది. కేంద్ర బృందం , శ్రీ సత్య సాయి జిల్లా, శ్రీ రమేష్ బాబు, కదిరి క్లస్టర్ ఏపీ డి, డిడబ్ల్యూ ఎమ్, ఏపీడి ఎంపీడీవో వెంకట రామిరెడ్డి, మండల ఉపాధి హామీ పథకం ఏపీవో చంద్రశేఖర్, ఈసీ, టీఏఎస్ , ఎఫ్ ఏ ఎస్, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, వెలుగు డిఆర్‌ఏ తదితరులు పాల్గొన్నారు.

## సత్య సాయి జిల్లా డిఐఈఓగా చెన్నకేశవ ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



**తనకల్ – సూర్య వాస్తవం, జులై 29 :**సత్య సాయి జిల్లా నూతన డిఐఈఓ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా ప్రస్తుతం తనకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేయుచున్న చెన్నకేశవ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం కొత్తచెరువులోని ఇంటర్మీడియట్ విద్యా మండలి జిల్లా కార్యాల యంలో ఆయన లాంఛనంగా పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా చెన్నకేశవ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, అధ్యాపకులకు అవసరమైన మద్దతు, శిక్షణ కల్పించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి తదితర అంశాలపై దృష్టి సారిస్తానని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన డిఐఈఓ చెన్నకేశవ ప్రసాద్ ను డి ఐ ఈ ఓ కార్యాలయ సిబ్బంది, తనకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది,కొత్తచెరువు జూనియర్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,వివిధ కళాశాలల సిబ్బంది శాలువాలు కప్పి పూలమాలల తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్ఐ రవికుమార్ సన్మానిస్తున్న మండల తెదేపా నాయకులు



**గాండ్లపెంట- సూర్య వాస్తవం,జూలై 29:** పోలీస్ స్టేషన్ కు నూతనంగా వచ్చిన ఎస్ఐ రవికుమార్ ను మంగళవారం మండల తెదేపా నాయకులు సన్మానించారు. అనంతరం దుష్మల్ పూలమాలతో తస్కరించి స్వాగతం పలికారు. మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు లేకుండా శాంతి భద్రత అటంకం కలగకుండ చూస్తామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు అక్రమ. భాష. ఆనంద్. లక్ష్మి నరసరావు. రెడ్డి. బాబా సికిందర్. సూర్య శేఖర్ రెడ్డి .ఆదిరెడ్డి. సిద్ధారెడ్డి. పరిమళ .పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )